సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
మంగళవారం, 22.09.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 322
పేజీలు: 08 వెల: రూ. 5

## సిమ్ కార్డులపై వార్నింగ్

**ఇతరుల ఐడీతో తీసుకుంటే ఇక జైలు శిక్షే!**



- ఫేక్ సిమ్‌ల దందాకు చెక్.. డీఓటీ కీలక హెచ్చరిక
- మీ పేరుపై ఎన్ని సిమ్‌లు ఉన్నాయో తెలుసా? ఇలా చెక్ చేయండి
- అనధికార సిమ్ కనెక్షన్లపై కేంద్రం కొరడా.. వెంటనే అప్రమత్తం

02

## జూరాల వద్ద తీవ్ర ఉద్రిక్తత

**రామ్మోహన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**





- ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే యత్నం, అరెస్ట్
- డ్యాం చుట్టూ పోలీసుల పహారా
- రైతుల నిరసనకు బీఆర్ఎఎస్ మద్దతు

02

## రాజకీయ జన్మనిచ్చింది కుప్పం

**కుప్పంతో కుటుంబ అనుబంధం: సీఎం చంద్రబాబు**

- మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం
- బిరుగనిపల్లె రిజర్వాయర్‌కు రూ.68 కోట్లు
- కుప్పం అభివృద్ధికి రూ.289 కోట్ల ప్రాజెక్టులు
- రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం
- కుప్పంలో రోజుకు 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యం



02

## ట్యాంక్‌బండ్‌పై ఉద్రిక్తత

**నిమజ్జనానికి అనుమతించాలని డిమాండ్**

- గణేష్ ఉత్సవ సమితి నేతల నిరసన
- పోలీసులు–ఉత్సవ సమితి సభ్యుల వాగ్వాదం
- బారికేడ్లు తొలగించే యత్నం

02



# ఫామ్‌హౌస్ ఫైట్‌లో కొత్త ట్విస్ట్!

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై సర్కార్ ఫోకస్

### కాంగ్రెస్ నేతల ఆస్తులపై బీఆర్ఎస్ కౌంటర్

- ప్రైవేట్ ఆస్తులను బయటపెట్టిన మన్నె క్రిశాంక్..
- ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని హితవు
- 111 జీవో.. అసైన్డ్ భూములు.. అటవీ భూములు అంటూ కాంగ్రెస్ నేతలపై ఆరోపణలు



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ రాజకీయాల్లో ఫామ్‌హౌస్‌ల వివాదం మరో మలుపు తిరిగింది. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబానికి చెందిన ఫామ్‌హౌస్‌ల చుట్టూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలకు గులాబీ పార్టీ కౌంటర్ ఎటాక్ ప్రారంభించింది. ‘‘ఒకరి ప్రైవేట్ ఆస్తులపై రాజకీయం చేస్తే.. అదే ప్రశ్నలు అధికార పార్టీ నేతల ఆస్తులపైనా వస్తాయి’’ అన్న రీతిలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ కాంగ్రెస్ నేతల ఫామ్‌హౌస్‌లు, ఇళ్లపై ఆరోపణలు సంధించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఫామ్‌హౌస్ రాజకీయాలకు తెరతీస్తోందని క్రిశాంక్ ఆరోపించారు. బీఆర్ఎస్ మాత్రం ప్రైవేట్ ఆస్తుల చుట్టూ తిరగకుండా ప్రజా సమస్యలపై పోరాడుతోందని పేర్కొన్నారు. ఒకవేళ కాంగ్రెస్ తరహాలోనే బీఆర్ఎస్ కూడా ప్రైవేట్ ఆస్తుల పరిశీలనకు ప్రతినిధి బృందాలను పంపితే.. కాంగ్రెస్ నేతలకు సంబంధించిన ఫామ్‌హౌస్‌ల జాబితా పెద్దదిగా ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

**ఇదిగో కాంగ్రెస్ ఫామ్‌హౌస్‌ల జాబితా అంటూ..**
మన్నె క్రిశాంక్ తన సోషల్ మీడియా పోస్టులో పలువురు కాంగ్రెస్ నేతలకు సంబంధించిన ఆస్తులపై ఆరోపణలు చేశారు. ఆయన పేర్కొన్న జాబితాలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, గుత్తా సుఖేందర్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, వేం నరేందర్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్లున్నాయి.

**క్రిశాంక్ ఆరోపణల ప్రకారం..**
**రేవంత్ రెడ్డి:** వట్టినాగులపల్లిలో 111 జీవో పరిధిలో ఫామ్‌హౌస్ ఉందని ఆరోపణ.
**పొంగులేటి:** హిమాయత్‌సాగర్ పరిధిలో 111 జీవోకు సంబంధించిన ప్రాంతంలో ఇల్లు ఉందని ఆరోపణ.
**వివేక్ వెంకటస్వామి:** హిమాయత్‌సాగర్ పరిధిలోనే ఫామ్‌హౌస్ నిర్మించారని ఆరోపణ.
**గుత్తా సుఖేందర్ రెడ్డి:** 111 జీవో పరిధిలో ఫామ్‌హౌస్ ఉందని పేర్కొన్నారు.
**పట్నం మహేందర్ రెడ్డి:** కొత్వాల్‌గూడలో అసైన్డ్ భూమిలో ఫామ్‌హౌస్ నిర్మించారని ఆరోపించారు.
**ప్రకాశ్ గౌడ్:** కొత్వాల్‌గూడలో అటవీ భూమికి సంబంధించిన నివాసం ఉందని ఆరోపించారు. మిగతా 02లో

# మహిళా సీఎం

## కవిత ఆశలు!

- తెలంగాణకు తొలి మహిళా సీఎం కావాలన్న కవిత లక్ష్యం!
- మహిళా సీఎం రేసులోకి కవిత.. కొత్త పార్టీతో భారీ స్కెచ్!
- సొంత ఇమేజ్ ఎంత కీలకం.. ముందున్నది సుదీర్ఘ పోరాటమే!
- కవితకు ప్లస్.. కవితకు మైనస్.. సీఎం లక్ష్యానికి ఇదే కీలకం!
- జయలలిత, మమత, మాయావతి బాటలో కవిత.. సాధ్యమేనా?

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ఉమ్మడి ఏపీలోనూ అలాగే విభజన తరువాత రెండు తెలుగు రాష్ట్రాలలో మహిళా సీఎంలు అయితే లేరు, ఇప్పటిదాకా చూస్తే హిస్టరీ అదే చెబుతోంది. ఇక ఈ రోజున దేశంలో చూస్తే ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా బీజేపీ తరఫున ఒక్కరే కనిపిస్తున్నారు. పదిహేనేళ్ల పాటు సీఎంగా పశ్చిమ బెంగాల్ ని పాలించిన మమతా బెనర్జీ ఈ ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలు అయ్యారు. తమిళనాడుని ఏలిన జయలలిత మరణించి పదేళ్ళు అయింది. యూపీలో మాయావతికి అధికారం దూరం అయితే దాదాపుగా రెండు దశాబ్దాలు అవుతోంది. ఈ రోజున దేశంలో చూస్తే మహిళా నాయకురాళ్ళ మిగతా 02లో



గెస్ట్‌హౌస్‌కు వస్తేనే

## కాంట్రాక్టు!

మహిళా పారిశ్రామికవేత్త శోభారెడ్డి సంచలన వ్యాఖ్యలు

02

- సీఎంను కలవాలని మహిళా పారిశ్రామికవేత్త విజ్ఞప్తి
- ఆరోపణలపై విచారణ జరపాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు

## గొప్ప ఊరట

నిబంధనలు సడలించిన ప్రభుత్వం

03



- నిర్మాణంలో ఉన్న ఇళ్లకు నిబంధనల సడలింపు
- ఎల్3 నుంచి ఎల్1 వరకు వన్‌టైమ్ క్లియరెన్స్
- అర్హత ఉన్న లబ్ధిదారులకు వెంటనే నిధులు
- పనులు ప్రారంభించని ఇళ్ల కేటాయింపులు రద్దు
- అదనపు ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరిస్తుంది

అణచివేతకు

## సర్కార్ కుట్ర

బీఆర్ఎస్ నేతల అరెస్టులపై కేటీఆర్ ఫైర్



- జూరాల నీటి కోసం బీఆర్ఎస్ ఆందోళన
- రైతులను వెంటనే విడుదల చేయాలి

02

నన్ను, కవితను రోడ్డున

## పడేశారు..

వందల కోట్ల ఆస్తి అంతా ఏమైంది?

02



- తాతల నాటి ఆస్తి అయితే మరి నా వాటా ఏది?
- సంతోష్ రావుకు వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి?

## ఇందిరమ్మ కుట్టు మిషన్లు

మంత్రి పొన్నం ప్రభాకర్

- కుట్టు మిషన్ల పథకానికి 4.06 లక్షల దరఖాస్తులు
- ఈ నెల 30తో దరఖాస్తుల గడువు
- విద్య, సాఫ్టిస్కాహారంపై కీలక ఆదేశాలు
- బీసీ గురుకులాలకు సొంత భవనాలు

బీసీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

03



AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 22.09.2026
www.mudranews.in | @mudranews



## ఇన్సులిన్ వాడుతున్నారా.. జాగ్రత్తలు తప్పనిసరి



ఇన్సులిన్‌ను సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయడం చాలా ముఖ్యం. అధిక వేడి లేదా ఫ్రీజింగ్‌కు గురైతే ఇన్సులిన్ ప్రభావం తగ్గవచ్చు. అలాగే ప్రతిరోజూ ఒకే ప్రదేశంలో ఇంజెక్షన్ వేయకుండా, సూచించిన ప్రాంతాలను మారుస్తూ ఉండాలి. ఒకే చోట పదేపదే ఇంజెక్షన్ ఇవ్వడం వల్ల చర్మం కింద గడ్డలు ఏర్పడి ఇన్సులిన్ శరీరంలో సరిగ్గా గ్రహించకపోవచ్చు.

## జూరాల వద్ద తీవ్ర ఉద్రిక్తత

**ముద్ర, మహబూబ్ నగర్:**
జూరాల ప్రాజెక్టు వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో రైతులు ధర్నాకు తరలిరావడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, రైతులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. దీంతో చిట్టెం రామ్మోహన్ రెడ్డిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి కూడా జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. రైతులతో కలిసి ధర్నాలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన్ను పోలీసులు అడ్డుకునేందుకు యత్నించారు. అలాగే ధర్నా చేసేందుకు వచ్చిన రైతులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలోనే తోపులాట జరిగింది. రైతులను బలవంతంగా అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఓ ఎస్సై ఓ రైతు గల్లా పట్టుకుని అడ్డుకున్నారు. అలాగే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. జూరాల ప్రాజెక్టు వద్ద ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో భారీగా పోలీసుల పహారా కొనసాగుతోంది. పోలీసులతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు కూడా అక్కడే మకాం వేశారు.

## అణచివేతకు సర్కార్ కుట్ర

**ముద్ర, హైదరాబాద్:**
జూరాల ఆయకట్టుకు సాగునీరిచ్చి పంటను కాపాడాలని డిమాండ్ చేసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. 'కళ్లముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతల గోసను ప్రభుత్వం తీర్చాల్సింది పోయి, న్యాయమైన డిమాండ్‌తో నిరసనకు సిద్ధమైన రైతులను, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ సర్కార్ కుట్ర చేస్తోంది. మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించడం రేవంత్ రాక్షస మనస్తత్వానికి నిదర్శనం. వందలాది రైతులను కూడా పోలీసులు అడ్డుకుని నిర్బంధించడం రాష్ట్రంలో సాగు తున్న అణచివేతకు ఉదాహరణ. సీఎంగా విఫలమైన రేవంత్ తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే జిల్లాలోని అనేక మండలాల్లో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు చీకటి ఆదేశాలిచ్చారు.
జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా కూడా విడుదల చేయకుండా కుంటి సాకులతో ప్రభుత్వం పచ్చని పంటల ఉసురు తీస్తోంది. తమ పంటలను కాపాడుకునే ఏకైక తపనతో రైతులు జూరాల గేట్లు ఎత్తే ప్రయత్నం చేస్తే వారిపై అక్రమ కేసులు బనాయించింది. తెలంగాణ గడ్డపై ఉన్న జూరాల ప్రాజెక్టు పరిసరాల్లోకి రైతులు రాకుండా ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటుచేసి వందలాది పోలీసులను చుట్టుపక్కల మోహరించడం.. వస్తున్న రైతులను అడ్డగించి అరెస్టులు చేయడం ముమ్మాటికీ సిగ్గుమాలిన చర్య. అక్రమంగా అరెస్టు చేసిన రైతులు, బీఆర్ఎస్ నేతలను ప్రభుత్వం విడుదల చేయడంతోపాటు జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలి'' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.



# మహిళా సీఎం

## కవిత ఆశలు !

**(మొదటి పేజీ తరువాయి)**
ఆద్వర్యంలో పార్టీలు కూడా తక్కువగా ఉన్నాయి. ఇక వారు ముఖ్యమంత్రులు కావడం అన్నది కూడా టఫ్ టాస్క్‌గా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణాలో ఒక మహిళగా కవిత తెలంగాణా రక్షణ సేన షార్ట్ కట్ లో టీఆర్ఎస్ పేరుతో ఒక పార్టీ పెట్టారు. తాను తెలంగాణకు తొలి మహిళా సీఎంగా రికార్డు క్రియేట్ చేయాలని చూస్తున్నారు.

**అతి పెద్ద ప్రయత్నంగా**
మహిళా ముఖ్యమంత్రులను ఈ దేశం చూసింది. కానీ అది బహు తక్కువ. ఎన్నో పోరాటాలు చేసిన మీదటనే జయలలిత, మాయావతి, మమతా బెనర్జీ సొంత పార్టీలతో సీఎంలు కాగలిగారు. ఇక రేఖా గుప్తా ని బీజేపీ ఎంపిక చేసింది. ఆ స్థాయిలో పోరాటాలు చేయగల సత్తా ఉంటే తెలంగాణాలో మహిళా సీఎం స్లాట్ లోకి కవిత వెళ్లగలదు, అయితే పైన చెప్పిన మహిళా ముఖ్యమంత్రులు అంతా అట్టడుగు స్థాయి నుంచి అనేక రకాలుగా పోరాటాలు చేసి తమకంటూ ఒక ఇమేజ్ సాధించారు. ఇక కవితలు ప్లస్ పాయింట్ అలాగే మైనస్ పాయింట్ కూడా తన పూర్వాశ్రమమే. కవిత కుమార్తెగానే ఈ రోజుకీ ఆమెకు గుర్తింపు ఉంది. ఆమె తనకంటూ ఒక సొంత ఇమేజ్ ని క్రియేట్ చేసుకోవాల్సి ఉంది. ఆ విషయంలో ఆమె ఇంకా చాలా అడుగులు వేయాల్సి ఉంది అన్నది ఒక కఠినమైన విశ్లేషణ.



**వీరంతా కూడా**
ఇక ఉమ్మడి ఏపీలో చూస్తే మూడు దశాబ్దాల క్రితం తొలి మహిళా సీఎంగా ఒక దశలో లక్ష్మీ పార్వతి పేరు ఎక్కువగా ప్రచారంలోకి వచ్చింది. అది నిజంగా అయ్యే పనేనా అన్నది పక్కన పెడితే 1995 ప్రాంతంలో ఎక్కువగా మీడియాలో ఇదే ప్రచారం అవుతూ వచ్చింది. చివరికి లక్ష్మీ పార్వతి పాతపట్నంలో జరిగిన ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలిచి మూడేళ్ల పాటు అసెంబ్లీలో ఉండగలిగారు. ఆమె పెట్టిన పార్టీ కూడా తరువాత కాలంలో కనిపించలేదు. అలాగే సినీ రంగంలో లేడీ సూపర్ స్టార్ గా ఎంతో పేరు తెచ్చుకుని రాములమ్మగా జనం మెప్పు పొందిన విజయశాంతి తల్లి తెలంగాణా పేరుతో ఒక ప్రాంతీయ పార్టీని ప్రారంభించారు. ఆ సమయంలో ఆమెకు ఉన్న జనాదరణ ప్రత్యేక ఇమేజ్ తో కచ్చితంగా రాజకీయంగా గట్టిగానే నిలబడతారు అని అనుకున్నారు. కానీ ఆ పార్టీని తరువాత బీజేపీలో విలీనం చేయడం జరిగింది. 2022 ప్రాంతంలో వైఎస్ షర్మిల వైఎస్సార్ టీపీ పేరుతో ఒక ప్రాంతీయ పార్టీని స్థాపించి వందల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. ఆమె రెండేళ్ళ పాటు పార్టీని నడిపారు. అయితే 2023 చివరిలో ఆమె పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసి ఏపీ పీసీసీ చీఫ్ పదవిలో కుదురుకున్నారు.

**పొలిటికల్ స్పేస్ ఉంటేనే**
ఇక్కడ ఒక విషయం ఉంది. రాజకీయాల్లో ఈ రోజుకీ అనేక కులాలు అలాగే వర్గాలకు ముఖ్యమంత్రి పదవి దక్కలేదు. అలాగే జెండర్ పరంగా చూస్తే మహిళలు జనాభాలో సగం ఉండి కూడా పాలకులు కాలేకపోతున్నారు. అయితే ఇవన్నీ ఎంత చెప్పుకున్నా పొలిటికల్ గా స్పేస్ అన్నది దొరకాలి. అలాగే జనాలకు చేరువ అయ్యేలా పార్టీలు ఉండాలి. అపుడే రాజకీయం పండుతుంది. రెండు పార్టీల వ్యవస్థ ఉన్న చోట ఎక్కువగా ఇది విజయవంతం అయింది. బహు ముఖమైన పోటీలు ఉన్న చోట అయితే టార్గెట్ ని ఎవరూ రీచ్ కాలేకపోతున్నారు. మహిళా ముఖ్యమంత్రులు కావాలి. అలాగే బీసీలతో పాటు ఇంకా అధికారం అందుకోని వారికి ముఖ్యమంత్రి పీఠం దక్కాలి. అయితే అది ఒక డిమాండ్ గానే మిగిలిపోకుండా ఆచరణాత్మకమైన పంథాలో సాగితేనే ఫలితాలు ఉంటాయని మేధావులు అంటున్నారు. కవిత ఆశలో తప్పు లేదు కానీ ఆచరణ అన్నదే చూడాలని అంటున్నారు.

## గెస్ట్‌హౌస్‌కు వస్తేనే కాంట్రాక్టు!

**ముద్ర, హైదరాబాద్:**
హైదరాబాద్‌లో అడ్వర్టైజింగ్ ఏజెన్సీ నడుపుతున్న శోభా రెడ్డి అనే మహిళా పారిశ్రామికవేత్త తనకు జరిగిన వేధింపులపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ కోరుతూ ఓ సోషల్ మీడియా వీడియోను విడుదల చేశారు. అవుట్‌డోర్ అడ్వర్టైజింగ్ రంగంలో చట్టబద్ధమైన అవకాశాల కోసం గత మూడేళ్లుగా ప్రయత్నిస్తున్నానని.. అయితే తనకు ఎదురైన అనుభవాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని శోభారెడ్డి పేర్కొన్నారు.
ఔట్ డోర్ అడ్వర్టైజింగ్ రంగంలో గత మూడేళ్లుగా తాను చట్టబద్ధంగా వ్యాపారం చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నానని.. ఈ క్రమంలో ప్రభుత్వ దృష్టికి తన సమస్యను తీసుకెళ్లే ప్రయత్నంలో ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితంగా ఉండే ఓ వ్యక్తిని సంప్రదించినట్లు శోభా రెడ్డి వెల్లడించారు. అయితే ఆ వ్యక్తి తన సమస్యను పరిష్కరించేందుకు నేరుగా గెస్ట్‌హౌస్‌కు రావాలని అడిగారని ఆమె సంచలన ఆరోపణ చేశారు. ఈ విషయాన్ని రాజకీయం చేయడం తనకు ఇష్టం లేదని.. సదరు వ్యక్తి పేరను బహిరంగంగా వెల్లడించబోనని చెప్తూనే.. మహిళా పారిశ్రామికవేత్తలకు సమాన అవకాశాలు, గౌరవప్రదమైన వాతావరణం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.
తాను ఎలాంటి ప్రత్యేక ప్రయోజనాలు ఆశించడం లేదని, కేవలం చట్టబద్ధమైన అవకాశం, సమానత్వం, ఆత్మగౌరవం మాత్రమే కోరుకుంటున్నానని శోభారెడ్డి స్పష్టం చేశారు. తన ఫిర్యాదును ఏ రాజకీయ పార్టీకి ముడిపెట్టవద్దని, ఊహాగానాల ఆధారంగా పేర్లను వైరల్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, మంత్రులను సంప్రదించినప్పుడు ఇది మున్సిపల్ శాఖ చూసే ముఖ్యమంత్రితో ముడిపడి ఉన్న అంశమని చెప్పడంతోనే తాను వారిని సంప్రగించాల్సి వచ్చిందని వివరించారు.
తాను చాలా పేద కుటుంబం నుంచి పైకి వచ్చానని.. ముగ్గురు పిల్లల బాధ్యత తనపై ఉందని ఆమె వెల్లడించారు. సోషల్ మీడియాలో తనపై నిరాధారమైన అసత్య ప్రచారాలు చేయవద్దని వేడుకున్నారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, జీహెచ్ ఎంసీ కమిషనర్ లకు ఆమె తన పోస్టును ట్యాగ్ చేశారు. సోషల్ మీడియా ఈ వీడియో, పోస్ట్ వైరల్ కావడంతో రాష్ట్ర ప్రభుత్వ నిఘా వర్గాలు కూడా దీనిపై ఆరా తీయడం ప్రారంభించాయి.
మహిళా పారిశ్రామికవేత్త శోభారెడ్డి ఆరోపణలపై బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎల్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ఓ మహిళా పారిశ్రామికవేత్త చట్టబద్ధమైన అవకాశం కోసం ఇన్ని ఇబ్బందులు పడటం దారుణమని విమర్శించారు. బాధితురాలికి మద్దతుగా మహిళా నాయకులు మాట్లాడాలని సూచించారు. సదరు గెస్ట్‌హౌస్ ఎవరిది? ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం అనుచరుడు ఎవరు? అనే అంశాలపై విచారణ జరిపి నిజానిజాలను తేల్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర సర్కారు నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## రాజకీయ జన్మనిచ్చింది కుప్పం

**ముద్ర, అమరావతి:**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రూ.38 కోట్ల పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు రూ.289 కోట్ల విలువైన ప్రాజెక్టులకు భూమిపూజ చేశారు. రూ.184 కోట్లతో చేపట్టనున్న భూగర్భ యుటిలిటీ ప్రాజెక్టుతో పాటు ఆర్డీఓ, ఏఎస్పీ కార్యాలయాలకు శంకుస్థాపన చేశారు. రూ.3.30 కోట్లతో నిర్మించిన ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్, మెటీరియల్ రికవరీ సెంటర్‌ను ప్రారంభించారు. మానసరోవర్ గ్లోబల్ యూనివర్సిటీలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2లో భాగంగా బిరుగనిపల్లె రిజర్వాయర్‌కు రూ.68 కోట్లు మంజూరు చేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. మదనపల్లె, యామిగానిపల్లెలోనూ రిజర్వాయర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. శ్రీశైలం నుంచి 660 కిలోమీటర్ల దూరంలోని కుప్పానికి నీటిని తీసుకొచ్చామని, రాయలసీమను ఎడారిగా మారకుండా చూడటమే లక్ష్యమన్నారు. కుప్పం ప్రజలతో తనది రాజకీయ సంబంధం కాదని, కుటుంబ అనుబంధమని చంద్రబాబు పేర్కొన్నారు. నారావారిపల్లి తనకు జన్మనిస్తే.. కుప్పం రాజకీయ పునర్జన్మనిచ్చిందన్నారు. 40 ఏళ్లుగా తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కుప్పాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రైతుల ఆదాయం పెంచేందుకు ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తామని, 32 రకాల విత్తనాలను పీడీఎంఎస్ ద్వారా విస్తరించేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. కుప్పంలో రోజుకు 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని, 200 మంది యువత, రైతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

## నన్ను, కవితను రోడ్డున పడేశారు

**ముద్ర, హైదరాబాద్:**
ఫాంహౌస్ లలో కూర్చుని తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం వేల కోట్లను కొల్లగొట్టిందని కాంగ్రెస్ నాయకురాలు రమ్యా రావు ఆరోపించారు. టీపీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి ఈ అక్రమాలు, కబ్జాలపై పోరాటం చేస్తే అక్రమ కేసులు పెట్టి వేధించారని విమర్శించారు. సీబీఐ, ఈడీ, దర్యాప్తు సంస్థలకు దొరకకుండా కేసీఆర్ ఫ్యామిలీ చేసిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడతాయని పేర్కొన్నారు.
గాంధీ భవన్‌లో రమ్యా రావు మీడియాతో మాట్లాడుతూ.. 2014లో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు టర్మ్స్ పాలనలో చేసిన అవినీతి, అక్రమాలు, అన్యాయాలపై పోరాటం చేస్తూనే ఉన్నాం. సోనియా గాంధీ ఎన్నో ఆశలతో తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే కేసీఆర్ ఫ్యామిలీ ఇష్టరీతిన దోచుకుందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుటుంబం చేసిన వందల ఎకరాల దోపిడీపై రాష్ట్ర ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు.
అప్పట్లో తమ కల్వకుంట్ల ఫ్యామిలీకి వందల ఎకరాలు ఉండేవని, నా పెళ్లి, కేటీఆర్ పెళ్లి అయ్యేవరకు మా ఆస్తులు పది ఎకరాలు లేని పరిస్థితి వచ్చిందన్నారు. మా తాత పేరు రాఘవరావు. ఆయన ఇద్దరు కుమారులు రంగారావు, చంద్రశేఖరరావు. కేటీఆర్ చెప్పిందే నిజమనుకుంటే కేసీఆర్ ఫ్యామిలీకి వందల ఎకరాలు ఉంటే మాకు కూడా వందల ఎకరాలు ఉండాలి. కేటీఆర్ గుంటూరులో చదువుకుంటే, నేను కరీంనగర్ లో చదివా. మాకు లేని ఆస్తులు మీ వద్ద ఎలా ఉన్నాయి. మా నాన్నకు ఆరోగ్యం బాగోలేనప్పుడు ఆస్తుల్ని ఏం చేశారని తెలంగాణ ఆడబిడ్డగా అడుగుతున్నాను.
ఉద్యమం సమయంలో సంబంధం లేదన్న సంతోష్ ఇప్పుడు ఎలా దగ్గరయ్యాడు. ఇన్ని తప్పులు జరుగుతుంటే మౌనంగా ఉండటంలో ఆశ్చర్యం ఏముంది. అవినీతిలో సంబంధం లేదంటే సంతోష్‌ను ఎందుకు పక్కన పెట్టుకున్నారు. సంతోష్ ఎన్నో భూములు దోచుకున్నాడు. అఫిడవిట్ లో లేని ఆస్తులు, గత ప్రభుత్వంలో ఎలా వచ్చాయి. బినామీలు, భూముల రూపంలో ఎన్నో ఆస్తులున్నాయి. సంతోష్ సోదరికి వివాహం అయ్యాక కూడా జోగినపల్లి సౌమ్య పేరిట సైతం భూములు ఉన్నాయని ఆరోపించారు.
కేటీఆర్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్‌లపై రమ్యారావు మరోసారి తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. సంతోష్ రావు అవినీతి, అక్రమాలపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తూ, ఆయనకు ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. గతంలో కరీంనగర్‌లో ఉన్నప్పుడు కనీసం సరైన వసతులు కూడా లేని సంతోష్ రావుకు, ఈరోజు ఇన్ని వేల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.
2015లో బీఆర్ఎస్ హయాంలో కుదురుపాక గ్రామంలో ఒక ప్రాజెక్టు ముంపునకు గురైనప్పుడు, ఆ గ్రామానికి ఏమాత్రం సంబంధం లేని సంతోష్ రావు ఆయన కుటుంబ సభ్యులు ఏకంగా 8 ప్లాట్ల పరిహారం పట్టాలు తీసుకున్నారని రమ్యా రావు ఆరోపించారు. సంతోష్ రావు బిసి అని చెప్పి అక్రమంగా ఈ పట్టాలు పొందారని, 2018 రాజ్యసభ ఎన్నికల అఫిడవిట్‌లో మాత్రం కేవలం ఒకే ఒక్క ప్లాట్‌ను చూపించి మిగిలిన 7 ప్లాట్లను దాచిపెట్టారని పేర్కొన్నారు. కుదురుపాక ప్రధాన రహదారిలోని బాధితుల భూములను అడ్డగోలుగా ఆక్రమించారని, 200 గజాల భూమిని కూడా వదలకుండా కబ్జాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
సంతోష్ రావుకు మార్కుక్ గ్రామంలో 9 ఎకరాల భూమితో పాటు బంజారాహిల్స్ రోడ్ నం. 14, కొండాపూర్ వంటి ఖరీదైన ప్రాంతాల్లో ఆస్తులు మరియు నివాసాలు ఎలా వచ్చాయని ఆమె ప్రశ్నించారు. అంతేకాకుండా, ఆయన భార్య రోహిణి పేరిట నానక్‌రామ్‌గూడలో భారీ కమర్షియల్ భవనాలు ఏ విధంగా వెలిశాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత అక్కాచెల్లెళ్లను పక్కనబెట్టి, అనేక ఆరోపణలు ఉన్న సంతోష్‌రావును కేసీఆర్ కుటుంబం ఎందుకు దగ్గరకు తీసిందో, ఆయన చేసిన అక్రమాలు తెలిసీ కేటీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలని రమ్యా రావు డిమాండ్ చేశారు.

## ట్యాంక్‌బండ్‌పై ఉద్రిక్తత

**ముద్ర, హైదరాబాద్:**
వినాయక నిమజ్జన వేడుకల నిర్వహణ విషయమై ట్యాంక్‌బండ్‌పై ఉద్రిక్తత నెలకొంది. నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తూ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ఆందోళనకు దిగడంతో పోలీసులు, ఉత్సవ సమితి సభ్యుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహించాలని గణేష్ ఉత్సవ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. అలాగే, జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేయని పక్షంలో తామే ఏర్పాట్లు చేసుకుంటామని ప్రకటించారు. ఈ క్రమంలో ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన బారికేడ్లను ఉత్సవ కమిటీ సభ్యులు తొలగించేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఉత్సవ సమితి సభ్యులు ట్యాంక్‌బండ్‌పై బైఠాయించి నిరసన తెలిపారు. ట్యాంక్‌బండ్‌పైనే వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహించేందుకు అనుమతివ్వాలని ఉత్సవ సమితి సభ్యులు అన్నారు.
ఈ సందర్భంగా హుస్సేన్‌సాగర్‌లో గణేష్ నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు తామే చేసుకుంటామని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్ తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జీహెచ్ఎంసీ అధికారుల వైఫల్యం కారణంగానే నిమజ్జన ఏర్పాట్ల విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు. అలాగే, 2001లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వమే ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. హిందూ పండగలు వచ్చిన ప్రతిసారీ ఏదో ఒక కారణంతో నిమజ్జనంపై ఆంక్షలు విధించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. హుస్సేన్‌సాగర్‌లో ప్రజల విశ్వాసాలు, సంప్రదాయాలకు అనుగుణంగానే గణేష్ నిమజ్జనం కొనసాగుతుందని తెలిపారు. అయితే, తమిళనాడులో జల్లికట్టుపై ప్రజల విశ్వాసాలను కాపాడిన తరహాలోనే హైదరాబాద్ గణేష్ భక్తుల విశ్వాసాలను కూడా ప్రభుత్వం గౌరవించి పరిరక్షించాలని రావినూతల కోరారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు.

## ఫామ్‌హౌస్ ఫైట్‌లో కొత్త ట్విస్ట్!

**(మొదటి పేజీ తరువాయి)**
**వేం నరేందర్ రెడ్డి:** అసైన్డ్ భూమికి సంబంధించిన అంశాన్ని ప్రస్తావించారు.
**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి:** రెడ్డిపల్లిలో ఫామ్‌హౌస్ ఉందని పేర్కొన్నారు.

**ఫామ్‌హౌస్ నుంచి 'ఫైట్‌హౌస్' వరకు..**
ఇప్పటివరకు కేసీఆర్ కుటుంబానికి చెందిన ఫామ్‌హౌస్‌లు, అక్కడ జరిగిన పరిణామాలే తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన చర్చగా ఉన్నాయి. అయితే తాజాగా బీఆర్ఎస్ కౌంటర్‌తో చర్చ కాంగ్రెస్ నేతల ఆస్తుల వైపు మళ్లింది. దీంతో ఫామ్‌హౌస్‌ల అంశం కేవలం ఒక కుటుంబానికి పరిమితమైన వ్యవహారం కాదని, అధికార–ప్రతిపక్షాల మధ్య రాజకీయ అస్త్రంగా మారుతోందనే చర్చ మొదలైంది. బీఆర్ఎస్ వాదన ఒకటైతే.. ప్రభుత్వం, కాంగ్రెస్ నేతల నుంచి ఈ ఆరోపణలపై వచ్చే వివరణ మరో కీలక అంశంగా మారనుంది. ముఖ్యంగా 111 జీవో, అసైన్డ్ భూములు, అటవీ భూములకు సంబంధించిన ఆరోపణలు కావడంతో సంబంధిత ప్రభుత్వ రికార్డులు, అనుమతులు, భూ వినియోగ వివరాలు ఏమి చెబుతున్నాయన్నది రాజకీయ చర్చకు కేంద్రంగా మారే అవకాశం ఉంది.

**'ప్రైవేట్ ఆస్తులపై రాజకీయం వద్దు'**
ప్రైవేట్ ఆస్తుల పేరుతో రాజకీయ వివాదాలు సృష్టించకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని క్రిశాంక్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ నేతలపై తాను చేసిన ఆరోపణలకు సంబంధించి సంబంధిత అధికారిక భూ రికార్డులు, దర్యాప్తు లేదా న్యాయపరమైన నిర్ధారణలు ఉన్నాయా అన్నది వేరుగా పరిశీలించాల్సి ఉంటుంది. అయితే రాజకీయంగా మాత్రం బీఆర్ఎస్ కౌంటర్ స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. "మీరు ఫామ్‌హౌస్ చూపిస్తే.. మేమూ మీ ఫామ్‌హౌస్‌ల జాబితా చూపిస్తాం'' అన్న తరహాలో మొదలైన ఈ ఫామ్‌హౌస్ ఫైట్ తెలంగాణ రాజకీయాల్లో మరింత వేడి పెంచేలా కనిపిస్తోంది.

## సిమ్ కార్డులపై వార్నింగ్..

**ముద్ర, హైదరాబాద్:**
దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, సిమ్ కార్డుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. అనుమతి లేకుండా ఇతరుల గుర్తింపు పత్రాలు ఉపయోగించి సిమ్ కార్డు తీసుకోవడం, జారీ చేయడం, టెలికాం గుర్తింపులను దుర్వినియోగం చేయడం, ఐఎంఈఐ నంబర్లలో అక్రమంగా మార్పులు చేయడాన్ని తీవ్ర నేరాలుగా పరిగణిస్తామని టెలీకమ్యూనికేషన్ విభాగం DoT వెల్లడించింది. ఇలాంటి నేరాలకు మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

**ఫేక్ సిమ్‌ల అక్రమ దందా వెలుగులోకి**
మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలలో ఇటీవల చేపట్టిన సైబర్ నేరాల దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఒక పాయింట్ ఆఫ్ సేల్ (PoS) ఏజెంట్, పౌరులకు తెలియకుండా వారి గుర్తింపు కార్డులతో అక్రమంగా 25 మొబైల్ కనెక్షన్లను యాక్టివేట్ చేసినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై వెంటనే స్పందించిన DoT సంబంధిత ఏజెంట్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి టెలికాం సేవలను నిలిపివేసింది. అక్రమంగా కేటాయించిన 25 సిమ్ నంబర్లను డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా రీ-వెరిఫికేషన్‌కు పంపగా ప్రక్రియ విఫలమవ్వడంతో ఆ నంబర్లను డియాక్టివేట్ చేశారు.

**మీ పేరుపై ఎన్ని సిమ్‌లు ఉన్నాయో చెక్ చేసుకోండి**
టెలికాం దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 'సంచార్ సాథీ' పోర్టల్, యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. వీటి ద్వారా మీ పేరు మీద ఎన్ని సిమ్‌లు ఉన్నాయో తెలుసుకోవచ్చు. సంచార్ సాథీ పోర్టల్ లేదా యాప్ ద్వారా తమ ఐడీపై ఎన్ని మొబైల్ నంబర్లు యాక్టివ్‌గా ఉన్నాయో తనిఖీ చేయవచ్చు. మీ పేరుమీద మీకు తెలియకుండా ఉన్న నంబర్లను లేదా మీకు అవసరం లేని నంబర్లను వెంటనే రిపోర్ట్ చేసి బ్లాక్ చేయవచ్చు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 22.09.2026
www.mudranews.in | @mudranews



## ఉదయం షుగర్ ఎందుకు పెరుగుతోంది?

కొంతమందిలో రాత్రి భోజనం తర్వాత ఏమీ తినకపోయినా ఉదయం రక్తంలో షుగర్ స్థాయిలు ఎక్కువగా నమోదవుతుంటాయి. దీనికి 'డాన్ ఫినామినా' ఒక కారణం కావచ్చు. తెల్లవారుజామున కార్టిసాల్, గ్రోత్ హార్మోన్ వంటి హార్మోన్ల ప్రభావంతో లివర్ నుంచి గ్లూకోజ్ రక్తంలోకి విడుదలవుతుంది. ఆలస్యంగా లేదా అధిక కార్బోహైడ్రేట్లతో భోజనం చేయడం కూడా ఉదయం షుగర్ పెరగడానికి కారణం కావచ్చు.




## SIR–2026పై 40 రోజులు ప్రత్యేక దృష్టి

**ముద్ర, సూర్యాపేట:** SIR–2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30–40 రోజులు ప్రత్యేక దృష్టి సారించి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫారం–6, 7, 8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని సూచించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అక్టోబర్ 25లోపు SIR–2026కు సంబంధించిన అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు. బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కలెక్టర్లు సమీక్షించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ బి.ఆర్. సింగ్, డీఆర్వో ప్రేమరాజు, ఆర్డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు. వీడియోకాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ బి.ఆర్.సింగ్, డిఆర్ఓ ప్రేమ రాజు,ఆర్డిఓ లు సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ వేణు మాధవరావు, సూర్యనారా యణ, శ్రీనివాసు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లు రవితేజ, అనూష తదితరులు పాల్గొన్నారు.

## కేదారి దంపతుల కుటుంబానికి రూ.10 లక్షల సాయం

**ముద్ర, హనుమకొండ:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో అంకితభావంతో సేవలందించిన దివంగత లింగాల కేదారి, ఆయన భార్య పుష్పలత కుటుంబానికి సీఎం సహాయ నిధి (CMRF) నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని సీఎం ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉద్యమ సమయంలో కేదారి దంపతులు హనుమకొండలో హోటల్ నిర్వహిస్తూ ఉద్యమకారులకు ఉచితంగా భోజనం, టిఫిన్లు, టీలు అందించారు. అన్నం వృథా చేయకూడదంటూ ప్రజల్లో అవగాహన కల్పించారు. కేదారి సెప్టెంబర్ 9న, పుష్పలత సెప్టెంబర్ 10న విషాదకర ఘటనలో మృతి చెందారు. మంజూరైన సాయాన్ని వారి చట్టబద్ధ వారసులకు అందించేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు.

## ప్రజాపాలనలో లాభాల శిఖరానికి ఏపీఎచ్ఎంఈఎల్

**మూడేళ్లలో రూ.34.20 కోట్ల నికర లాభం**
**2025-26లోనే రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల లాభాలు**
**సింగరేణి నిర్వహణ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో కొత్త ఉత్సాహం**
**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో విస్తరణ చర్యలు**



**ముద్ర, హైదరాబాద్ :** ఒకప్పుడు రూ.21 కోట్లకు పైగా నష్టాలతో మూసివేత అంచులకు చేరిన ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఏపీఎచ్‌ఎంఈఎల్) ఇప్పుడు లాభాల బాటలో దూసుకుపోతోంది. సింగరేణి నిర్వహణ, రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో సంస్థ ఆర్థికంగా బలోపేతమవుతోంది. గత మూడేళ్లలోనే రూ.34.20 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల లాభం నమోదు చేసింది.2023–24లో రూ.1.05 కోట్లు, 2024–25లో రూ.9.87 కోట్లు, 2025–26లో రూ.23.33 కోట్ల నికర లాభాలు సాధించింది. 1998–99లో సింగరేణి ఆధీనంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సంస్థ సంచిత లాభాలు రూ.60.85 కోట్లకు చేరాయి.సింగరేణితోపాటు బీహెచ్‌ఈఎల్, జెన్‌కో, ఎన్‌ఎండీసీ, ఆర్‌ఐఎన్‌ఎల్ వంటి ప్రముఖ సంస్థలకు యంత్రాలు, విడిభాగాలను సరఫరా చేస్తూ ఏపీఎచ్‌ఎంఈఎల్ తన మార్కెట్‌ను విస్తరిస్తోంది. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తుల్లో వైవిధ్యం, వ్యయ నియంత్రణ చర్యలు లాభాల పెరుగుదలకు దోహదపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో సంస్థను జాతీయ స్థాయిలో పోటీపడే సంస్థగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్లాంట్‌లో 300 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా విద్యుత్ ఖర్చును తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. రోజుకు సుమారు 1,200 కిలోవాట్ అవర్‌ల విద్యుత్ ఉత్పత్తి, నెలకు దాదాపు రూ.2 లక్షల వరకు ఆదా అయ్యే అవకాశం ఉంది.మూసివేత అంచుల నుంచి లాభాల సంస్థగా మారిన ఏపీఎచ్‌ఎంఈఎల్‌ను మరింత విస్తరించి జాతీయస్థాయి భారీ ఇంజినీరింగ్ సంస్థగా తీర్చిదిద్దే దిశగా సింగరేణి ముందుకు సాగుతోంది.

## హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణ కేంద్రం

**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌ను దేశంలోనే హెల్త్ ఇన్నోవేషన్స్‌కు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. టీ–హబ్‌లో నిర్వహించిన 'హోమా సీఎంఈ–2026' జాతీయ సదస్సును సోమవారం ఆయన ప్రారంభించారు. ఐటీ, ఫార్మా, లైఫ్‌సైన్సెస్, స్టార్టప్ రంగాలను హెల్త్‌కేర్‌తో అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. డయాబెటిస్, మెటబాలిక్ వ్యాధులను లైఫ్‌స్టైల్ డేటా విశ్లేషణతో ముందుగానే గుర్తించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కొత్త ఆవిష్కరణలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా 'ది న్యూ పారాడైమ్' పుస్తకాన్ని ఆవిష్కరించడంతో పాటు 'మెట్రిక్ ఎక్స్‌ప్లోరర్' మెటబాలిక్ కాలిక్యులేటర్ యాప్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ఎంపిక చేసిన 50 మంది రోగులకు ఉచిత ప్రొటోకాల్ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

## అక్టోబర్ 2 గ్రామసభల్లో ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై తీర్మానాలు




**ముద్ర, హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు గ్రామ స్థాయిలో పటిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 2న జరిగే గ్రామసభల్లో ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై చర్చించి తీర్మానాలు చేయాలని సూచించారు. గ్రామ అవసరాలు, అందుబాటులో ఉన్న నిధుల ఆధారంగా పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ కింద ఈ ఏడాది రూ.6,700 కోట్లతో పనులు చేపడుతున్నామని, జలసిరి కార్యక్రమాన్ని వేగవంతం చేసి నీటి భద్రతకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల అవసరాలను గుర్తించాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీతక్క తెలిపారు.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను ఘనంగా నిర్వహించాలి

**తెలంగాణపై కేంద్రం ఉంచిన విశ్వాసాన్ని చాటేలా ఏర్పాట్లు ఉండాలి**
**క్రీడాకారులు, కోచ్‌లు, సాంకేతిక సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించాలి**
**పోటీల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు: మంత్రి వాకిటి శ్రీహరి**




**ముద్ర, హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టేలా ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026ను అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా తెలంగాణకు మంచి పేరు వచ్చేలా పోటీల నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026 నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి (క్రీడలు) జయేష్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (SATG) వీసీ & ఎండీ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవి సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ తెలంగాణకు లభించిన ప్రతిష్టాత్మక అవకాశం అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో నమ్మకంతో ఈ క్రీడా పోటీల నిర్వహణ బాధ్యతలను తెలంగాణకు అప్పగించిందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి దశలోనూ సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, సాంకేతిక అధికారులు, ఇతర సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. వసతి, రవాణా, ఆహారం, భద్రత, వైద్య సదుపాయాలు, క్రీడా వేదికలు, క్రీడా సామగ్రి తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను కేవలం ఒక క్రీడా ఈవెంట్‌గా కాకుండా, తెలంగాణ క్రీడా సామర్థ్యాన్ని దేశానికి చాటే వేదికగా తీర్చిదిద్దాలని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ, సౌకర్యాలు కల్పించి వారు అత్యుత్తమ ప్రతిభ కనబరిచేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.క్రీడా శాఖ, స్పోర్ట్స్ అథారిటీ, వివిధ ప్రభుత్వ శాఖలు, క్రీడా సంఘాలు, సంబంధిత సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే భారీ స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించగలమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను స్పష్టంగా నిర్దేశించి, నిరంతర పర్యవేక్షణతో ఏర్పాట్లను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

**17 సబ్ కమిటీల ఏర్పాటు**

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి (క్రీడలు) జయేష్ రంజన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి అధ్యక్షతన ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేసి, దాని ఆధ్వర్యంలో 17 సబ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను ఈ కమిటీల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, ఏర్పాట్లను సమగ్రంగా ముందుకు తీసుకెళ్లనున్నట్లు వివరించారు.రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు ఏర్పాటు చేయనున్న సబ్ కమిటీల్లో సంబంధిత క్రీడా సంఘాల ప్రతినిధులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. క్రీడా పోటీలకు అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధం చేసి, వాటిని సురక్షితంగా భద్రపరచడంతో పాటు అవసరమైన సమయంలో క్రీడాకారులకు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ & ఎండీ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవి మాట్లాడుతూ, ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026 నిర్వహణకు సంబంధించి స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే చేపట్టిన చర్యలు, ప్రస్తుతం కొనసాగుతున్న ఏర్పాట్లు, వివిధ విభాగాల సమన్వయం, తదుపరి కార్యాచరణపై సమావేశానికి సమగ్ర వివరాలు అందించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026ను తెలంగాణ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేలా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టి బాధ్యతతో, చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. పోటీల నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ, దేశం నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులు తెలంగాణ నుంచి మంచి అనుభూతితో తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు ఉండాలని ఆయన అన్నారు.

## దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టులో పిటిషన్

**ముద్ర, న్యూఢిల్లీ:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన అనర్హతను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టులో ప్రస్తావించారు. తెలంగాణ శాసనసభలో 10వ షెడ్యూల్ కింద తనపై అనర్హత వేటు విధించడాన్ని ఆయన సవాలు చేశారు. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి (CJI) ఈ కేసును బుధవారం విచారణకు చేపడతామని తెలిపారు. దీంతో దానం నాగేందర్ అనర్హత వ్యవహారం మరోసారి న్యాయస్థానం ముందుకు వచ్చింది.

## రైతులకు రూ.813 కోట్ల పరిహారం వెంటనే చెల్లించాలి: ఉత్తమ్

**ముద్ర, హైదరాబాద్ :** భూసేకరణ, పునరావాసం–పునర్వ్యవస్థీకరణకు విడుదల చేసిన రూ.813 కోట్లను తక్షణమే రైతులకు చెల్లించాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిధులు విడుదలైనప్పటికీ ప్రభుత్వ ఖాతాల్లోనే ఉండిపోవడం, భూసేకరణ పూర్తికాక సాగునీటి ప్రాజెక్టులు ఆలస్యం కావడం సమంజసం కాదన్నారు. సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పరిహారం చెల్లింపులపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సమీక్షించారు. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రూ.3,101 కోట్ల విలువైన టోకెన్లు సమర్పించగా, ప్రభుత్వం రూ.2,504 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో రూ.502 కోట్లు భూసేకరణ అధికారుల వద్ద, రూ.311 కోట్లు కలెక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

కలెక్టర్లు స్వయంగా జోక్యం చేసుకుని రైతులతో మాట్లాడి అవార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఉత్తమ్ సూచించారు. రైతుల పట్ల న్యాయబద్ధంగా, మానవీయంగా వ్యవహరించాలని,



చెల్లింపుల్లో జాప్యమైతే నిబంధనల ప్రకారం వడ్డీ చెల్లించాలని ఆదేశించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతుల కోసం 2026లో రూ.6 వేల కోట్లు అదనంగా అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు గొప్ప ఊరట




**నిబంధనలు సడలించిన ప్రభుత్వం**
**నిర్మాణంలో ఉన్న ఇళ్లకు నిబంధనల సడలింపు**
**ఎల్3 నుంచి ఎల్1 వరకు వన్‌టైమ్ క్లియరెన్స్**
**అర్హత ఉన్న లబ్ధిదారులకు వెంటనే నిధులు**
**పనులు ప్రారంభించని ఇళ్ల కేటాయింపులు రద్దు**
**అదనపు ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరిస్తుంది**

**ముద్ర హైదరాబాద్ :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన నిబంధనలను సడలిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ వెసులుబాటు కల్పించినట్లు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం బేస్‌మెంట్ దశలో లేదా ఆపై స్థాయికి చేరుకున్న ఇళ్లకు 'వన్ టైమ్' పద్ధతిలో క్లియరెన్స్ ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు.ఇందులో భాగంగా ఎల్3 (L3) నుంచి ఎల్1 (L1) కేసులకు ఒకేసారి ప్రత్యేక అనుమతులు కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అర్హత కలిగిన నిర్మాణాలకు వెంటనే నిధులు విడుదల చేసేలా అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. అయితే, ఈ ప్రత్యేక సడలింపు కేవలం ఒక్కసారి మాత్రమే వర్తిస్తుందని, భవిష్యత్తులో వచ్చే ఎల్3 మంజూరులకు ఇది వర్తించదని స్పష్టం చేశారు. ఈ సడలింపుల వల్ల ప్రభుత్వానికి అదనంగా పడే ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ఆయన భరోసానిచ్చారు. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరైనప్పటికీ ఇంతవరకు ఎలాంటి పనులు ప్రారంభించని లబ్ధిదారుల విషయంలో ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు నిర్మాణం మొదలుపెట్టని ఇళ్ల కేటాయింపులను రద్దు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఆ విధంగా రద్దైన ఇళ్లను వెంటనే గుర్తించి, నిజమైన అర్హులైన ఇతర లబ్ధిదారులకు కేటాయించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.

## బీసీ మహిళలకు గుడ్‌న్యూస్..



**'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు'**
**కుట్టు మిషన్ల పథకానికి 4.06 లక్షల దరఖాస్తులు**
**ఈ నెల 30తో దరఖాస్తుల గడువు..**
**విద్య, పౌష్టికాహారంపై కీలక ఆదేశాలు**
**బీసీ గురుకులాలకు సొంత భవనాలు..**
**బీసీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు..**
**- మంత్రి పొన్నం ప్రభాకర్**

**ముద్ర, హైదరాబాద్:** బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ సంక్షేమ, విద్యా కార్యక్రమాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా బీసీ మహిళలకు అందిస్తున్న 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకం దరఖాస్తుల ప్రక్రియ, అమలు తీరుపై చర్చించారు. ఈ పథకానికి ఇప్పటివరకు 4.06 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 30తో ముగియనున్న నేపథ్యంలో అర్హులైన మహిళలకు పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అలాగే బీసీ గురుకులాలు, హాస్టళ్ల పనితీరుపై మంత్రి సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో 327 బీసీ గురుకుల పాఠశాలలు ఉండగా, కేవలం 21 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన గురుకులాలకు సొంత భవనాల నిర్మాణం కోసం స్థల సేకరణ చేపట్టాలని మంత్రి సూచించారు. బీసీల ఆర్థికాభివృద్ధి, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని పొన్నం ప్రభాకర్ తెలిపారు.సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బాల మాయాదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
మంగళవారం 22.09.2026

4 వేదిక
Peoples Voice
మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com






## మంచి ఆరోగ్యం కోసం
# ఇవి అవసరం

చావు ఒకరోజు వస్తుంది.. కానీ అనారోగ్యంతో ప్రతి రోజూ బాధపడుతూ జీవించాల్సిన అవసరం లేదు!
జీవితం ఒక్కసారే వస్తుంది.. ఏది పడితే అది తినేద్దాం అని అనుకోవడం సులభం. కానీ ఒకసారి షుగర్, బీపీ, అధిక బరువు, కొవ్వు కాలేయం, గుండె లేదా కిడ్నీ సమస్యలు మొదలైతే..
మన అలవాట్ల ప్రభావం అప్పుడు అర్థమవుతుంది
ఆరోగ్యం పోయిన తర్వాత వెతకడం కంటే.. ఆరోగ్యంగా ఉన్నప్పుడే కాపాడుకోవడం మంచిది.

### ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి 10 సులభమైన అలవాట్లు

రోజూ శారీరకంగా చురుకుగా ఉండండి
రోజుకు కనీసం 30 నిమిషాలు నడవడం లేదా మీకు సరిపోయే వ్యాయామం చేయడం అలవాటు చేసుకోండి.
ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు పెంచండి
పప్పులు, గుడ్లు, చేపలు, పెరుగు వంటి పోషకాహారాన్ని తగిన మోతాదులో తీసుకోండి.

**చక్కెరను తగ్గించండి**
కూల్‌డ్రింక్స్, స్వీట్లు, బిస్కెట్లు, బేకరీ పదార్థాలు తరచుగా తీసుకునే అలవాటును తగ్గించండి.

**ఉప్పును పరిమితంగా తీసుకోండి**
అధిక ఉప్పు రక్తపోటు ప్రమాదాన్ని పెంచుతుంది.

**ఎక్కువసేపు కూర్చోకండి**
ప్రతి గంటకోసారి లేచి కొద్దిసేపు నడవండి. దగ్గర దూరాలకు సాధ్యమైనప్పుడు నడవండి.

**తగినంత నిద్రపోండి**
పెద్దలకు సాధారణంగా రోజుకు 7–9 గంటల నాణ్యమైన నిద్ర అవసరం.

**ఒత్తిడిని నియంత్రించుకోండి**
ధ్యానం, యోగా, శ్వాసాభ్యాసం, కుటుంబంతో సమయం గడపడం వంటి అలవాట్లు ఉపయోగపడవచ్చు.

**పొగతాగడం, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండండి**
ఆరోగ్యానికి హాని కలిగించే అలవాట్లను వీలైనంత త్వరగా వదిలేయండి.

**నీళ్లు తగినంత తాగండి**
మీ వయస్సు, వాతావరణం, శారీరక శ్రమకు అనుగుణంగా తగినంత ద్రవాలు తీసుకోండి.

**క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోండి**
బీపీ, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ వంటి పరీక్షలను వైద్యుల సలహా మేరకు చేయించుకోండి.

**గుర్తుంచుకోండి..**
ఆరోగ్యానికి సమయం కేటాయించకపోతే..
ఒకరోజు అనారోగ్యానికి సమయం కేటాయించాల్సి రావచ్చు.
డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో..
ఆరోగ్యంగా ఉండటం కూడా అంతే ముఖ్యం.
మీ కుటుంబానికి మీరు అవసరం.
అందుకే మీ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకండి.

**ఈరోజే ఒక నిర్ణయం తీసుకోండి**
'నా ఆరోగ్యం.. నా బాధ్యత'
ఈ సందేశం ఉపయోగకరంగా అనిపిస్తే ఒక్కసారి షేర్ చేయండి.
మీ షేర్ వల్ల ఇంకొకరికి ఆరోగ్యంపై అవగాహన కలగవచ్చు.
ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.. ఆరోగ్య అవగాహనను పంచుకుందాం.




## 40 ఏళ్లు దాటాయా..
# ఇలా చేయాల్సిందే..

నలబై దాటిన తర్వాత జీవితం ఒక కొత్త దశలోకి ప్రవేశిస్తుంది. ఈ వయసులో బాధ్యతలు పెరుగుతాయి, పని ఒత్తిడి ఉంటుంది, కుటుంబ బాధ్యతలు ఉంటాయి. అదే సమయంలో శరీరంలో కూడా వయసుకు సంబంధించిన కొన్ని మార్పులు మొదలవుతాయి. అందుకే ఈ దశ నుంచి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. వయసు పెరుగుతున్న కొద్దీ మన నిజమైన సంపద డబ్బు మాత్రమే కాదు—ఆరోగ్యం, ప్రశాంతమైన మనసు, మంచి సంబంధాలు కూడా.

### ఆరోగ్యమే అసలైన ఆస్తి

మన దగ్గర ఎంత డబ్బు, ఆస్తి ఉన్నా ఆరోగ్యం బాగాలేకపోతే వాటిని పూర్తిగా ఆస్వాదించలేం. అందుకే 40 తర్వాత బరువు, రక్తపోటు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ వంటి ఆరోగ్య సూచికలపై శ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా కుటుంబంలో మధుమేహం లేదా గుండె సంబంధిత సమస్యల చరిత్ర ఉంటే వైద్యుల సలహాతో తగిన పరీక్షలు చేయించుకోవాలి. ఒకసారి రిపోర్టు బాగొచ్చిందని జీవితాంతం ఆరోగ్యం బాగుంటుందని కాదు..

### శరీరాన్ని బలంగా ఉంచుకోవాలి

వయసు పెరిగే కొద్దీ కండరాల బలం, శారీరక సామర్థ్యం తగ్గే అవకాశం ఉంటుంది. అందుకే నడక, తేలికపాటి ఏరోబిక్ వ్యాయామంతో పాటు వయసు, ఆరోగ్య పరిస్థితికి తగిన బలం పెంచే వ్యాయామాలు కూడా ఉపయోగపడతాయి. వెయిట్ ట్రైనింగ్ చేయాలనుకునేవారు సరైన పద్ధతిని నేర్చుకుని, అవసరమైతే నిపుణుల మార్గదర్శకత్వంతో ప్రారంభించాలి. వ్యాయామం లక్ష్యం శరీరాన్ని బాధపెట్టడం కాదు; రోజువారీ పనులను సులభంగా చేసుకునేంత బలంగా, చురుగ్గా ఉంచడం.

### ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

40 తర్వాత ఆహారపు అలవాట్లను ఒకసారి పరిశీలించుకోవాలి. కూరగాయలు, పండ్లు, పప్పులు, సంపూర్ణ ధాన్యాలు, తగిన ప్రోటీన్ వంటి పోషకమైన ఆహారాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారం, ఎక్కువ ఉప్పు, చక్కెర, అనారోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారాన్ని పరిమితం చేయడం మంచిది. ఆహారం విషయంలో అందరికీ ఒకే నియమం ఉండదు. మధుమేహం, బీపీ లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు తమ వైద్యుడు లేదా డైటీషియన్ సలహా తీసుకోవాలి.

### సప్లిమెంట్లు అందరికీ తప్పనిసరి కావు

40 ఏళ్లు దాటిన తర్వాత ఒమేగా–3, విటమిన్ D వంటి సప్లిమెంట్లు అందరూ తప్పనిసరిగా తీసుకోవాలనే నియమం లేదు. అవసరమైన పోషకాలు సాధ్యమైనంత వరకు సమతుల్యమైన ఆహారం ద్వారా పొందడం మంచిది. విటమిన్ D లేదా ఇతర పోషకాల లోపం ఉన్నట్లు పరీక్షల్లో తేలితే వైద్యుల సలహాతో సప్లిమెంట్లు తీసుకోవచ్చు. అవసరం లేకుండా ఎక్కువ మోతాదులో సప్లిమెంట్లు తీసుకోవడం మంచిది కాదు.

### ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

"ప్రతి సంవత్సరం అందరూ పూర్తి బాడీ చెకప్ చేయించుకోవాలి" అనేది ప్రతి వ్యక్తికి వర్తించే ఒకే నియమం కాదు. వయసు, కుటుంబ చరిత్ర, గత ఆరోగ్య సమస్యలు, జీవనశైలి వంటి అంశాలను బట్టి వైద్యుడు అవసరమైన పరీక్షలను సూచిస్తారు. రక్తపోటు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ వంటి పరీక్షలు అవసరమైనప్పుడు చేయించుకోవడం ముఖ్యం. ఈసీజీ, అల్ట్రాసౌండ్ వంటి పరీక్షలు కూడా వైద్యపరమైన అవసరాన్ని బట్టి చేయించుకోవాలి.

### లక్షణాలను నిర్లక్ష్యం చేయకండి

ఛాతీలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అసాధారణమైన గుండె దడ, అకస్మాత్తుగా బలహీనత, నిరంతర అలసట, కారణం తెలియని బరువు మార్పులు వంటి లక్షణాలు ఉంటే వాటిని వయసు కారణంగా వచ్చాయని అనుకోకండి. అవసరమైనప్పుడు వైద్యుడిని సంప్రదించడం మంచిది.



వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే, ప్రమాద కారకాలను ముందుగానే గుర్తించి నియంత్రించుకోవడం ఎంతో ఉపయోగకరం.

### నిద్రకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి

ఆరోగ్యకరమైన జీవనశైలిలో నిద్ర ఒక ముఖ్యమైన భాగం. రాత్రివేళ ఎక్కువసేపు మొబైల్ చూడటం, ఆలస్యంగా నిద్రపోవడం, నిద్ర సమయాన్ని తరచుగా మార్చడం వంటి అలవాట్లను తగ్గించుకోవాలి. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, ఉదయం ఒకే సమయానికి లేవడం వంటి క్రమబద్ధమైన అలవాట్లు నిద్ర నాణ్యతకు సహాయపడతాయి. నిద్రలో నిరంతర సమస్యలు ఉంటే వైద్యుడిని సంప్రదించాలి.

### ఒత్తిడిని తగ్గించుకోవాలి

40 తర్వాత కుటుంబం, ఉద్యోగం, ఆర్థిక విషయాలు వంటి అనేక బాధ్యతలు ఉంటాయి. వాటి గురించి నిరంతరం ఆందోళన చెందడం మనసుపై ప్రభావం చూపుతుంది. ప్రతి రోజూ కొంత సమయం మన కోసం కేటాయించుకోవాలి. నడక, పుస్తక పఠనం, సంగీతం, ధ్యానం, కుటుంబంతో సంభాషణ, ప్రకృతిలో గడపడం వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలు ఒత్తిడిని నిర్వహించడంలో సహాయపడవచ్చు.

### అందరినీ సంతోషపెట్టాలనుకోవద్దు

మన జీవితంలో ఇతరుల అభిప్రాయాలకు ఒక పరిమితి వరకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి ఒక్కరినీ సంతోషపెట్టడం సాధ్యం కాదు. మన బాధ్యతలను నిర్వర్తిస్తూ, మన విలువలను గౌరవిస్తూ, మనకు నిజంగా ముఖ్యమైన విషయాలకు సమయం కేటాయించాలి. కుటుంబంతో నాణ్యమైన సమయం గడపడం, మనకు ఇష్టమైన పనులు చేయడం, ప్రశాంతంగా జీవించడం కూడా ఆరోగ్యానికి ఒక రకమైన పెట్టుబడే.

### శరీర బరువుపై శ్రద్ధ పెట్టాలి

40 తర్వాత శారీరక చురుకుదనం తగ్గితే బరువు పెరగడం సులభం కావచ్చు. అధిక బరువు మధుమేహం, బీపీ, కొలెస్ట్రాల్ వంటి అనేక సమస్యలకు ప్రమాదాన్ని పెంచవచ్చు. అందుకే బరువు మాత్రమే కాకుండా నడుము చుట్టుకొలత, ఆహారం, వ్యాయామం, రోజువారీ చురుకుదనం వంటి అంశాలను కూడా గమనించాలి. ఆకస్మికంగా కఠినమైన డైట్ మొదలుపెట్టడం కంటే, దీర్ఘకాలం కొనసాగించగల ఆరోగ్యకరమైన అలవాట్లు మంచివి.

### కదలికను భాగం చేసుకోవాలి

రోజంతా కుర్చీలో కూర్చునే అలవాటు ఉంటే మధ్య మధ్యలో లేచి కొద్దిసేపు నడవాలి. సాధ్యమైనంత వరకు మెట్లు ఎక్కడం, ఇంటి పనుల్లో పాల్గొనడం, చిన్న దూరాలకు నడవడం వంటి చిన్న మార్పులు కూడా రోజువారీ శారీరక చురుకుదనాన్ని పెంచుతాయి. వ్యాయామం కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించలేని వారు కూడా రోజులో చిన్న చిన్న కదలికలను పెంచుకోవచ్చు.

### ధూమపానం, మద్యపానం వద్దు

వయసు పెరుగుతున్న కొద్దీ చెడు అలవాట్ల ప్రభావం మరింత ముఖ్యమవుతుంది. ధూమపానం ఆరోగ్యానికి హానికరం. మద్యపానం కూడా అనేక ఆరోగ్య ప్రమాదాలతో సంబంధం కలిగి ఉంటుంది. వీటిని మానేయడం లేదా తగ్గించడం ఆరోగ్యానికి ఉపయోగకరం. ఇప్పటికే అలవాటు ఉంటే, అవసరమైతే వైద్యుల సహాయం తీసుకుని క్రమంగా బయటపడే ప్రయత్నం చేయాలి.

### సంబంధాలను కాపాడుకోవాలి

ఆరోగ్యం అంటే కేవలం శరీరం మాత్రమే కాదు; మనసు కూడా. కుటుంబ సభ్యులతో ప్రేమగా మాట్లాడటం, స్నేహితులతో సంబంధాలను కొనసాగించడం, మనసులోని విషయాలను పంచుకోవడం మనసుకు బలాన్ని ఇస్తాయి. వయసు పెరిగే కొద్దీ మన చుట్టూ ఉన్న మంచి మనుషుల విలువ మరింత తెలుస్తుంది. అందుకే డబ్బు సంపాదించడంతో పాటు మంచి సంబంధాలను కూడా సంపాదించుకోవాలి.

### ఈరోజే మొదలు పెట్టాలి

"ఇంకా వయసుంది, తర్వాత చూసుకుందాం" అనే ఆలోచనను 40 తర్వాత మార్చుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమమైన వ్యాయామం, మంచి నిద్ర, అవసరమైన ఆరోగ్య పరీక్షలు, ఒత్తిడి నియంత్రణ—ఇవన్నీ ఒక్కరోజులో ఫలితాలు ఇవ్వకపోయినా, సంవత్సరాల తర్వాత పెద్ద ప్రయోజనం ఇస్తాయి. చిన్న మార్పులను ప్రతిరోజూ పాటించడం పెద్ద మార్పుకు దారి తీస్తుంది.

### ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలి

40 ఏళ్లు దాటడం అంటే వృద్ధాప్యం ప్రారంభమైందని కాదు. ఇది మన జీవితాన్ని మరింత జాగ్రత్తగా, అర్థవంతంగా తీర్చిదిద్దుకునే దశ. ఆరోగ్యాన్ని సంపదగా భావించి, శరీరాన్ని చురుగ్గా ఉంచి, మనసును ప్రశాంతంగా ఉంచి, కుటుంబంతో ఆనందంగా గడిపితే ముందున్న సంవత్సరాలను మరింత సంతోషంగా జీవించవచ్చు. ఇతరుల కోసం బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మన ఆరోగ్యం మరియు ఆనందం కోసం కూడా కొంత సమయం కేటాయించుకోవాలి.

> నలబై ఏళ్లు దాటిన తర్వాత వయసును ఆపలేం.. కానీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మన అలవాట్లను మాత్రం మార్చుకోవచ్చు."

# నిద్రలో కలవరింత..!

సాధారణంగా నిద్రలో ఉన్నప్పుడు కొందరు కలవరిస్తారు. వారికి తెలియకుండానే నిద్రలో మాట్లాడటం, గట్టిగా అరవడం వంటి చేస్తుంటారు. నిజ జీవితంలో ఎలా ఇతరులతో మాట్లాడుతారో.. అలానే నిద్రలో కూడా కలవరిస్తుంటారు. ముఖ్యంగా రోజులో ఏ విషయం గురించి ఎక్కువ మాట్లాడుతారో దాని గురించే కలవరిస్తుంటారు. ఇలా కలవరిస్తున్నట్లు మనకి తెలియదు. కానీ మన పక్కన ఉన్న వాళ్లకి అయితే తెలుస్తుంది. నిద్ర నుంచి బయటకు వచ్చిన కూడా కలవరించినట్లు తెలియదు. అయితే పిల్లలు ఎక్కువగా నిద్రలో కలవరిస్తారు. రోజంతా ఆడుకోవడం వంటి వాటి వల్ల పిల్లలు కలవరిస్తారు. అయితే ఎప్పుడో ఒకసారి కలవరిస్తే పర్లేదు. కానీ రోజూ ఇలానే నిద్రలో కలవరిస్తే మాత్రం లైట్ తీసుకోవద్దని నిపుణులు అంటున్నారు. అసలు నిద్రలో ఎందుకు కలవరిస్తారు? దీనికి గల కారణాలు ఏంటి? దీని నుంచి బయటపడటం ఎలాగో స్టోరీలో తెలుసుకుందాం.

మీకు తెలియకుండా నిద్రలో కలవరించడాన్ని సోమ్నిలోక్వి అంటారు. అయితే ఇది అందరిలో ఉండదు. కేవలం కొందరిలో మాత్రమే కనిపిస్తుంది. ఎక్కువగా మూడు నుంచి పదేళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలకు మాత్రమే కనిపిస్తుంది. సాధారణంగా పిల్లలు నిద్రలో మాట్లాడతారు. కానీ అది ఎక్కువగా జరిగితే మాత్రం తప్పకుండా వైద్యని సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు. అయితే నిద్రలో కలవరించడానికి చాలానే కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా పీడకలలు, ఒత్తిడి, ఆందోళన, మానసిక సమస్యలు వంటి వాటి వల్ల కొందరు కలలో కలవరపడుతుంటారని నిపుణులు అంటున్నారు. పిల్లలు ఎక్కువగా ఇతరులతో ఆడుతుంటారు. ఇలాంటి సమయాల్లో వారు కొన్ని విషయాలకు భయపడటం వంటివి చేస్తుంటారు. వీటివల్ల వారికి తెలియకుండానే నిద్రలో కలవరిస్తుంటారు. అలాగే పిల్లలకు సరైన నిద్ర లేకపోవడం, అధిక జ్వరం వంటి సమయాల్లో కూడా కలవరిస్తారు. కొందరు బాగా అలసిపోయినప్పుడు, డిప్రెషన్‌లోకి వెళ్లడం వల్ల నిద్రలో కలవరింతలు వస్తాయని నిపుణులు అంటున్నారు.

నిద్రలో కలవరింత సమస్య నుంచి విముక్తి చెందాలంటే మాత్రం వెంటనే వైద్యుని సంప్రదించాలి. కలవరింత ఏం కాదని లైట్ తీసుకోకుడదని నిపుణులు అంటున్నారు. ఈ సమస్య నుంచి బయటపడాలంటే బాడీకి సరిపడా నిద్రపోవాలి. అలాగే ఒత్తిడి, ఆందోళనకు దూరంగా ఉండాలి. చిన్న విషయాలకు ఎక్కువగా ఆలోచించి, టెన్షన్ తీసుకోకూడదు. మెడిటేషన్, యోగా వంటివి చేస్తుండాలి. దేని గురించి పగలంతా ఎక్కువగా ఆలోచిస్తారో.. రాత్రి సమయాల్లో కలవరిస్తారు. కాబట్టి ఎక్కువగా ఏ విషయం గురించి ఆలోచించవద్దు. పూర్తిగా నిద్రకు దూరంగా ఉండకుండా బాడీకి సరిపడా నిద్రపోయేలా ప్లాన్ చేసుకోండి. రోజుకి తప్పకుండా 8 గంటలు నిద్రపోండి. అప్పుడే మీకు ఎలాంటి కలవరింతలు నిద్రలో రావు. నిద్రలేమి సమస్య ఉన్నా కూడా ఇది ఎక్కువ అవుతుంది. ఇలా ఎన్ని నియమాలు పాటించిన కూడా సమస్య పరిష్కారం కాలేదంటే.. మాత్రం వెంటనే వైద్యుని సంప్రదించాలి. ఏం కాదులే అని లైట్ తీసుకున్నారో.. ఇక అంతే సంగతులు.



## నిన్నటి మనకంటే
# నేడు మెరుగ్గా ఉండాలి




జీవితంలో ప్రతి ఒక్కరికీ తమకంటూ ఒక ప్రత్యేకమైన ప్రయాణం ఉంటుంది. అందుకే మనల్ని ఎప్పుడూ ఇతరులతో పోల్చుకోవడం అవసరం లేదు. వారి పరిస్థితులు, అవకాశాలు, లక్ష్యాలు మనకు భిన్నంగా ఉండవచ్చు. మన దృష్టి మన అభివృద్ధిపైనే ఉండాలి.

ఇతరులు మనకంటే ముందున్నారని బాధపడటం వల్ల మనలో నిరాశ పెరుగుతుంది. దాని బదులుగా నిన్న మనం ఎలా ఉన్నామో, ఈరోజు మనం ఎంత మెరుగ్గా ఉన్నామో ఆలోచించాలి. చిన్న మార్పు అయినా అది మన జీవితంలో పురోగతికి సంకేతమే.

ప్రతిరోజూ ఒక కొత్త విషయం నేర్చుకోవడం, ఒక మంచి అలవాటును పెంచుకోవడం, ఒక చెడు అలవాటును తగ్గించుకోవడం ద్వారా మనల్ని మనం మెరుగుపరుచుకోవచ్చు. మార్పు ఒక్కరోజులో రాదు. నిరంతర ప్రయత్నం ద్వారా మన వ్యక్తిత్వం, ఆలోచనలు, జీవన విధానం క్రమంగా మారుతాయి.

మన గతంలోని తప్పులను చూసి బాధపడటం కంటే వాటి నుంచి పాఠాలు నేర్చుకోవాలి. నిన్న చేసిన తప్పును ఈరోజు సరిదిద్దుకోవడం కూడా ఒక విజయం. ప్రతి రోజు మనకు మనల్ని మనం మార్చుకునే కొత్త అవకాశాన్ని ఇస్తుంది.

ఇతరులతో పోటీ పడటం వల్ల మనశ్శాంతి దెబ్బతినవచ్చు. కానీ మన నిన్నటి స్థితితో ఈరోజు మన స్థితిని పోల్చుకుంటే మన పురోగతి స్పష్టంగా కనిపిస్తుంది. చిన్న విజయాలను కూడా గుర్తించి, వాటి ద్వారా మరింత ముందుకు సాగాలి.

జీవితంలో అసలైన పోటీ మనతో మనకే ఉండాలి. నిన్నటి కంటే ఈరోజు కొంచెం మెరుగ్గా, ఈరోజు కంటే రేపు మరింత మెరుగ్గా ఉండేందుకు ప్రయత్నిస్తే మన జీవితం క్రమంగా మంచి దిశలో సాగుతుంది. అదే నిజమైన అభివృద్ధికి మార్గం.

'ఇతరులతో పోటీ పడటం కంటే.. నిన్నటి మనకంటే ఈరోజు మనం మెరుగ్గా ఉండటమే నిజమైన విజయం.'

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 22.09.2026
www.mudranews.in | @mudranews



**ఇన్ఫెక్షన్ ఉంటే షుగర్ పెరగొచ్చు**

ఇన్ఫెక్షన్లతో షుగర్ పెరుగుదలచిన్న ఇన్ఫెక్షన్ కూడా.. షుగర్‌ను అమాంతం పెంచొచ్చు!పంటి నొప్పి, చిగుళ్ల సమస్యలు, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వంటి సమస్యలు ఉన్నప్పుడు శరీరంలో ఒత్తిడి పెరుగుతుంది. ఈ సమయంలో విడుదలయ్యే కొన్ని హార్మోన్లు ఇన్సులిన్ పనితీరును ప్రభావితం చేసి రక్తంలో షుగర్ స్థాయిలను పెంచవచ్చు. ముఖ్యంగా వృద్ధుల్లో ఇన్ఫెక్షన్ లక్షణాలు స్పష్టంగా కనిపించకపోయినా సమస్య ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ నగేష్

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజలనుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.సాగునీరు విడుదల చేయాలి టేక్మాల్ మండలం వేల్పుగొండ రెవెన్యూ పరిధిలోని సూరంపల్లి గ్రామ శివారులో 110 ఎకరాల వరి పంటకు వేల్పుగొండ పెద్దచెరువు నుండి తక్షణమే సాగునీరు విడుదల చేయించి ఆదుకోవాలని రైతులు కలెక్టర్ ప్రతిమా సింగ్ కు వినతిపత్రం అందజేశారు. వేల్పుగొండ పెద్దచెరువు కింద దాదాపు 300 ఎకరాల భూమి సాగవుతోందని రైతులు లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం వేల్పుగొండ గ్రామంలో ఎలాంటి పంటలు సాగు చేయలేదు, కానీ సూరంపల్లిలో సుమారు 110 ఎకరాల్లో వేసిన వరి పంట ప్రస్తుతం పొట్టదశలో




ఉందని తెలిపారు. ఈ కీలక సమయంలో పంటకు నీరు ఎంతో అవసరమని, వేల్పుగొండ గ్రామ రైతులు, ప్రజలు నీటిని వదలకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమయానికి నీరు అందకపోతే పొట్టదశలో ఉన్న 110 ఎకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సూరంపల్లి పంట పొలాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుని ఆదుకోవాలని రైతులు కలెక్టర్‌ను కోరారు.వినతులు స్వీకరించిన ఎస్పీ...ప్రజావాణిలో అందే ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన



ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ చేపట్టి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని, విచారణలోని పురోగతిని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు.

# అన్ని రంగాల్లో మెదక్ అభివృద్ధే లక్ష్యం

### ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్

**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులను తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. సోమవారం మెదక్ పట్టణంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద కుటుంబాలకు రేషన్ కార్డు ఎంతో కీలకమని, ప్రభుత్వ సంక్షేమ




పథకాలు పొందేందుకు అర్హత కల్పించే ముఖ్యమైన పత్రాల్లో ఇది ఒకటని అన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్య, వైద్యం తదితర రంగాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.అభివృద్ధి.. సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యతఇందిరమ్మ రాజ్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయనిఅన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.★ కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ..★ చిన్న శంకరంపేట మండలంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో గణేష్ నిమజ్జనం

### లడ్డు సొంతం చేసుకున్న హెడ్ కానిస్టేబుల్ జాఫర్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో గణపతి నవరాత్రుల్లో పూజలు అందుకున్న లడ్డూ వేలంపాట నిర్వహించగా హెడ్ కానిస్టేబుల్ జాఫర్ రూ.29,000లకు లడ్డూను సొంతం చేసుకున్నారు.అంతకుముందు ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత ఏడు రోజులుగా విశేష పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమంలో భాగంగా ఎస్పీ శోభాయాత్రను ప్రారంభించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డప్పు వాయిద్యాల నడుమ కోలాటాలు, ఆటపాటలతో గణనాథునికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ సందీప్ రెడ్డి, ఆర్ఐ శైలేందర్, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఇరాన్ '100' కోడ్ జారీ..

**పశ్చిమాసియా మళ్లీ అట్టుడకనుందా? క్యాంప్ నుంచి ఒక్కరోజు ముందే వచ్చేసిన ట్రంప్ తాజా సంకేతాలు ఏం సూచిస్తున్నాయి**



**ముద్ర, ఢిల్లీ :** పశ్చిమాసియా మళ్లీ అట్టుడకనుందా? బాంబుల మోతతో దద్దరిల్లనుందా? మధ్యప్రాచ్యం మళ్లీ కుతకుతలాడనుందా? తాజా పరిణామాలు చూస్తుంటే.. అదే సంకేతాలు ఇస్తున్నాయి. ఒకవైపు హౌతీలు దూసుకొస్తుండడం.. ఇంకోవైపు ఇరాన్ 'కోడ్ 100' హెచ్చరిక జారీ చేయడం.. మరోవైపు వారాంతపు సెలవు దినాన్ని డేవిడ్ క్యాంప్ నుంచి ముందుగానే ముగించుకుని ట్రంప్ తిరిగి రావడం.. అలాగే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కూడా అమెరికా పర్యటన కుదించుకుని తిరిగి వచ్చేయడం. ఇదంతా చూస్తుంటే మరోసారి పశ్చిమాసియా రణరంగంగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచ దేశాలు ఇంధన సంక్షోభంతో అల్లాడిపోతున్నాయి. మళ్లీ యుద్ధం వస్తే ఈసారి పరిణామాలు తీవ్రంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఎల్‌నినో కారణంగా ప్రపంచ దేశాల్లో తీవ్ర ద్రవ్యోల్బణం ఏర్పడింది. దీనికి యుద్ధం కూడా తోడైతే ప్రపంచం ఆర్థికంగా తల్లకిందులయ్యే డేంజర్ సంకేతాలు వెలువడుతున్నాయి.ఇరాన్‌కు సంబంధించిన ఓ కీలక వార్త ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇరాన్ తన సాయుధ బలగాలకు 'కోడ్ 100 అలర్ట్ జారీ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఇది ఇరాన్ సైన్యం అత్యున్నత స్థాయి సన్నద్ధతగా పలు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే ఈ అలర్ట్ జారీ చేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా లేదా ప్రభుత్వ వార్తా సంస్థలు ఇప్పటివరకు ధ్రువీకరించలేదు.ఈ పరిణామాల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా క్యాంప్ డేవిడ్‌లో తన వారాంతపు పర్యటనను కుదించుకుని షెడ్యూల్ కంటే ముందుగానే వైట్‌హౌస్‌కు తిరిగి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ట్రంప్ ముందస్తు తిరుగు ప్రయాణానికి ఇరాన్ 'కోడ్ 100' అలర్ట్ కారణమని అమెరికా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు.ఇరాన్ 'కోడ్ 100' అంటే ఏమిటి?నివేదికల ప్రకారం 'కోడ్ 100' అనేది ఇరాన్ సాయుధ బలగాలకు అత్యున్నత స్థాయి సైనిక సన్నద్ధతను సూచించే అలర్ట్‌గా పేర్కొంటున్నారు. ఇది నిజంగా అమలులోకి వచ్చినట్లయితే ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ సాధారణ సైన్యం, భద్రతా బలగాలను అత్యంత అప్రమత్త స్థితిలో ఉంచే అవకాశం ఉంటుంది. సంభావ్య దాడులు లేదా సైనిక ఘర్షణలకు వెంటనే స్పందించేందుకు దళాలను సిద్ధంగా ఉంచడం, సైనిక సమాచార వ్యవస్థలను మరింత చురుకుగా చేయడం, వేగవంతమైన మోహరింపులకు ఏర్పాట్లు చేయడం వంటి చర్యలు ఇందులో ఉండొచ్చని నివేదికలు చెబుతున్నాయి. అయితే 'కోడ్ 100' నిజంగా అమలు చేశారా? పశ్చిమాసియాలో ఇటీవలి పరిణామాల నేపథ్యంలో ఈ వార్తలు తెరపైకి వచ్చాయి. ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ దళాలు సౌదీ అరేబియాపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు ప్రకటించాయి. రియాద్ పరిసర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగినట్లు హౌతీలు పేర్కొనగా సౌదీ అధికారులు తమ వైమానిక రక్షణ వ్యవస్థలు ముంచుకొస్తున్న ముప్పులను అడ్డుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇరాన్ 'కోడ్ 100' అలర్ట్‌కు సంబంధించి అధికారిక ధ్రువీకరణ లేకపోయినా.. హౌతీ దాడులు, అమెరికా భద్రతా హెచ్చరికలు, పశ్చిమాసియాలో పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ వార్త మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్

### ఎన్నికల అధికారి, మెదక్ ఆర్డీఓ రమాదేవి




**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,మెదక్ జిల్లా శాఖ నిర్వహణ కమిటీకి ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ అయింది. అక్టోబర్ 4న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, మెదక్ రెవెన్యూ డివిజనల్ అధికారి రమాదేవి తెలిపారు. అదే విధంగా తుది సభ్యుల జాబితాను కూడా ప్రచురించడం జరిగిందన్నారు.మెదక్ జిల్లా శాఖకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులందరికీ ఎన్నికల కార్యక్రమాన్ని ప్రకటించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివరాలను వెల్లడించారు. ఈనెల 24న ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మెదక్ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహణ కమిటీ సభ్యుల పదవులకు నామినేషన్ల స్వీకరణ, 25న ఉ. 10 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితా ప్రచురణ, 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల ఉపసంహరణ, తుది నామినేషన్ల జాబితా ప్రచురణ, గుర్తుల కేటాయింపు. అక్టోబర్ 4న అవసరమైన పక్షంలో ఎన్నికలు ఉ 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం ఫలితాలను ప్రకటిస్తారు. ఫలితాల ప్రకటన అనంతరం ఆఫీస్ బేరర్ల ఎన్నికలు నిర్వహిస్తారు.మరిన్ని వివరాల కోసం ఎన్నికల అధికారి ఫోన్ నంబర్ 9346999257ను సంప్రదించాలని సూచించారు.

## విఘ్నేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే రోహిత్

### మండపాలలో పూజలు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ రావు మెదక్ పట్టణంలో పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆది దేవుడి అనుగ్రహంతో మెదక్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని వేడుకున్నారు. వెనుకబడిన ప్రాంతం అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని, అందుకు ఆ వినాయకుడి సంపూర్ణ అనుగ్రహం ఉండాలన్నారు. వెంట మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, ఎన్జీవో కాలనీ అధ్యక్షులు జి. వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్ హరిత, మున్సిపల్ కౌన్సిలర్లు, మండప నిర్వాహకులు తదితరులున్నారు

## భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

### ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో జరిగిన హత్య కేసులో నిందితురాలికి జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.6 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. పర్కిబండకు చెందిన మురళికి, మనోహరాబాద్‌కు చెందిన విజయలక్ష్మితో సుమారు 22 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య వివాదాలు జరుగుతుండటంతో మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలో కూడా పంచాయతీలు నిర్వహించి ఇరువురికి నచ్చజెప్పారు.మురళికి సుమారు 18 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో అప్పటి నుంచి పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి.ఈ క్రమంలో 2021 మర్చి 15న రాత్రి మురళి మంచంపై నిద్రిస్తున్న సమయంలో విజయలక్ష్మి రోకలిబండతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి దర్యాప్తు అధికారి తూప్రాన్ సీఐ స్వామిగౌడ్ పూర్తి స్థాయిలో సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత దర్యాప్తు అధికారి వెంకట రాజాగౌడ్, ప్రస్తుత మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్ సాక్షులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టి పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితురాలికి జీవిత ఖైదుతో పాటు రూ.6 వేల జరిమానా విధించారు.కేసు విచారణలో కోర్టు లైజన్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ మహిపాల్ రెడ్డి సహకరించారు.

## ప్రజాపాలనలో మహిళలకు రక్షణ లేదా?

### శోభారెడ్డి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలి:కీర్తిరెడ్డి



**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 21:** రాష్ట్రంలో మహిళల భద్రతపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జూబ్లీహిల్స్‌లో ఆమె మాట్లాడుతూ.. యువ పారిశ్రామికవేత్త కె. శోభారెడ్డి ఓ వ్యక్తిపై చేసిన వేధింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు.ఔట్ డోర్ అడ్వర్టైజింగ్ రంగంలో చట్టబద్ధమైన వ్యాపార అవకాశం కోసం ప్రయత్నిస్తున్న సమయంలో, ముఖ్యమంత్రికి సన్నిహితుడిగా చెప్పుకున్న వ్యక్తి గెస్ట్‌హౌస్‌కు రావాలని కోరినట్లు శోభారెడ్డి సోషల్ మీడియా వేదికగా ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే ఆ వ్యక్తి పేరు ఆమె వెల్లడించలేదు. ఈ ఆరోపణలపై ఇప్పటివరకు అధికారికంగా పూర్తి వివరాలు వెలువడలేదు.ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కీర్తిరెడ్డి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీఎంగా, హోంమంత్రిగా ఈ అంశంపై స్పందించాలని అన్నారు. మహిళా భద్రత రాజకీయాలకు అతీతమైన అంశమని, ఆరోపణలు ఎవరిపై వచ్చినా నిష్పక్షపాతంగా విచారణ జరగాలని డిమాండ్ చేశారు."మహిళలు, యువ పారిశ్రామికవేత్తలు తమ ప్రతిభతో ముందుకు రావాల్సిన సమయంలో అధికార ప్రభావం, రాజకీయ పరిచయాలకు సంబంధించిన ఆరోపణలు రావడం ఆందోళనకరం" అని కీర్తిరెడ్డి పేర్కొన్నారు. శోభారెడ్డికి న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు.ప్రభుత్వం ఈ ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని, అవసరమైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

## షుగర్ రీడింగ్ పదేపదే పెరిగితే నిర్లక్ష్యం వద్దు

ఆహారం తీసుకున్న తర్వాత షుగర్ కొంత పెరగడం సాధారణమే. అయితే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పదేపదే వైద్యులు సూచించిన టార్గెట్ కంటే ఎక్కువగా నమోదవుతుంటే కారణాన్ని గుర్తించడం అవసరం. తిన్న కొన్ని గంటల తర్వాత కూడా షుగర్ తగ్గకుండా కొనసాగితే వైద్యులను సంప్రదించాలి. మందులు, ఆహారం, ఇన్సులిన్ వినియోగం లేదా ఇతర ఆరోగ్య సమస్యలను పరిశీలించి తగిన చికిత్స తీసుకోవడం ముఖ్యం.



## సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచాలి

**- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్:** డిండి, అచ్చంపేట సాగునీటి ప్రాజెక్టులతో పాటు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో డిండి, అచ్చంపేట ప్రాంతాల్లో చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని ప్రాజెక్టుల వారీగా మంత్రి సమీక్షించారు. నిర్మాణ పనులు, భూసేకరణ, పునరావాస ప్రక్రియ, పెండింగ్ పనులు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుల అమలులో ఉన్న అడ్డంకులను గుర్తించి, వాటిని సత్వరమే పరిష్కరించే చర్యలు చేపట్టాలని సూచించారు.పనుల్లో జాప్యం జరగకుండా ప్రతి ప్రాజెక్టుకు స్పష్టమైన లక్ష్యాలు, గడువులతో కార్యాచరణ రూపొందించాలని మంత్రి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో అధికారుల సమన్వయంతో పనిచేసి భూసేకరణ, పునరావాస ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు. పెండింగ్ అంశాలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు.

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పురోగతిపైనా సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. డిండి, అచ్చంపేట ప్రాంతాల రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైతులకు ప్రయోజనం చేకూరేలా ప్రాజెక్టుల పనులను వేగంగా పూర్తి చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

సమావేశానికి ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్ ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరయ్యారు. నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఇ. శ్రీధర్, పునరావాసం, భూసేకరణ కమిషనర్ శివకుమార్ నాయుడు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, ఇంజినీర్–ఇన్–చీఫ్ రమేష్‌బాబుతో పాటు సంబంధిత చీఫ్ ఇంజినీర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు వేగవంతం చేయాలి : సీఎం రేవంత్



**ముద్ర, హైదరాబాద్:** వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో జరిగిన సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నిధులు గ్రీన్‌చానల్‌లో మంజూరవుతున్నా పనులు వేగంగా సాగకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే 30 రోజులు 24 గంటల పాటు పనులు కొనసాగించాలని, వర్క్‌షెడ్యూల్ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ప్రతిరోజూ పనులను పర్యవేక్షించాలని, ప్రతి పనికి ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం కోసం కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేయాలని, త్వరలో ఓపీ సేవలు ప్రారంభించాలని ఆదేశించారు. సనత్‌నగర్ టిమ్స్ తరహాలో వరంగల్‌లో ఓపీ సేవలు అందుబాటులోకి తేవాలని, ఆస్పత్రి పరిసరాలను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు.

## 22ఏ నిబంధన కలకలం

**గ్రామాల్లో గందరగోళం.... - కొనుగోలుదారుల్లో గుబులు....**




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** 1908 నాటి పాత రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ నిబంధన ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా పెద్ద దుమారాన్నే రేపుతోంది. ఒకప్పుడు మూలనపడ్డ ఈ చట్టం, ప్రస్తుతం అటు రాజకీయ వర్గాల్లోనూ, ఇటు సామాన్య ప్రజానీకంలోనూ తీవ్ర చర్చనీయాం శంగా మారింది. అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ, అటవీ, ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధించే ఈ నిబంధన కొందరికి సంతోషాన్ని కలిగిస్తుంటే, మరికొందరికి నిద్రలేకుండా చేస్తోం ది. తెలంగాణ ప్రభుత్వం 'భూ భారతి' చట్టం కింద గ్రామాల్లో 22ఏ నిషేధిత భూముల జాబితాలను వెల్లడించడంతో ఒక్కసారిగా కలకలం మొదలైంది. గతంలో ధరణి పోర్టల్ అమలులోకి వచ్చిన సమయంలో అధికారుల అత్యుత్సాహం, సాంకేతిక లోపాల వల్ల తీవ్ర సమస్యలు తలెత్తాయి. ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల కోసం కొంత భూమిని సేకరిస్తే, సదరు సర్వే నంబర్ మొత్తాన్ని నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల లక్షలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ భూ చిక్కులను సరిదిద్దేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టినప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రచురించిన 22ఏ జాబితాలు మళ్లీ కొత్త అయోమయానికి దారితీశాయి. ముఖ్యంగా 1970ల కాలంలో ప్రభుత్వం నిరుపేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూముల చుట్టూ ఇప్పుడు పెద్ద వివాదమే నడుస్తోంది. తరతరాలుగా అనుభవించడం తప్ప విక్రయించేందుకు వీలులేని ఈ భూములు, పట్టణాల విస్తరణ, రియల్ ఎస్టేట్ భూమ్ కారణంగా విపరీతమైన డిమాండ్ సాధించాయి. ఫలితంగా, అప్పట్లో తక్కువ ధరకు వస్తుండటంతో రెవెన్యూ అధికారుల సహకారంతో బడా బాబుల నుంచి సామాన్యుల వరకు చాలామంది ఈ భూములను కొనుగోలు చేశారు. దశాబ్దాలుగా అనేక చేతులు మారిన ఈ ఆస్తులు ఇప్పుడు ఉన్నపలంగా నిషేధిత జాబితాలోకి చేరడంతో, వీటిని నమ్ముకున్న కొనుగోలుదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అర్హత లేని వారి చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుందనే వార్తలు పల్లెల్లో తీవ్ర భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి. అంతేకాకుండా, దశాబ్దాలుగా నివాసాలు నిర్మించుకుని, ప్రభుత్వ అనుమతులు పొంది, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న స్థలాలను కూడా ఇప్పుడు 22ఏ పరిధిలోకి తీసుకురావడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆక్రమణలకు పాల్పడిన వారిపై, కావాలని ప్రభుత్వ భూములను కాజేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో తప్పులేదని, కానీ కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టుకుని స్థలాలు కొనుగోలు చేసిన సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా సామాన్య ప్రజలకు నష్టం జరగకుండా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఈ 22ఏ భయాలను వెంటనే తొలగించాలని బాధితులు కోరుతున్నారు.

## పాపాల చిట్టా బయట పెడతాం.. ప్రజల్లో దోషులుగా నిలబెడతాం

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, కరీంనగర్ :** రానున్న రెండేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో చేసిన అవినీతి చిట్కాలు బయటపెట్టి ప్రజల ముందు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో పాటు మాజీ మంత్రి హరీష్, రావు, కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ లను దోషులుగా నిలబెడతామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రం కేంద్రంలో పలు వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి ప్రజలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో జరిగిన అవినీతిని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు అసెంబ్లీ సాక్షిగా బయటపెట్టారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కెసిఆర్ ఫామ్ హౌస్ ముందు దళితులు ధర్నా చేస్తే పసుపు నీళ్లతో శుద్ధిచేసిన సంఘటనపై నేటి వరకు కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో ఉన్న అసైన్మెంట్ భూముల బాగోతాన్ని బయటపెట్టి పేద దళితులకు పంపిణీ చేస్తున్న మంత్రి తెలిపారు. 10ఏళ్ళు అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులు ప్రజా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు. రానున్న రెండేళ్ల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో జరిగింది అవినీతిని ప్రజల ముందు ఉంచి బీఆర్ఎస్ నాయకులను దోషులుగా నిలబెడతామని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

కార్యక్రమంలో ధర్మారం మండల పార్టీ అధ్యక్షుడు రూప్ల నాయక్ తో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి, అంజన్న, ఉదయ్, ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత..

***గాగిరెడ్డిపల్లి గ్రామంలో జిపి కార్మికులకు ఘన సన్మానం..**




**ముద్ర చిగురుమామిడి:** మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని సర్పంచ్ సన్నిల్ల కవిత అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సన్నీళ్ల కవిత వెంకటేష్ మాట్లాడుతూ మాట్లాడుతు పరిశుభ్రమైన గ్రామమే మన లక్ష్యం అనే సందేశంతో గ్రామంలో నిరంతరం పారిశుధ్య పనులు చేపడుతూ ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నవారే పారిశుధ్య కార్మికుల పాత్ర చాల గొప్పదాని అన్నారు.గ్రామాన్ని పరిశుభ్రంగా ఆరోగ్యకరంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవని అన్నారు.పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి వారికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సన్నిల్ల కవిత,వెంకటేష్ ఉపసర్పంచ్ నరేందర్ రెడ్డి,పాలకవర్గ సభ్యులు మంద శ్రీనివాస్,బొమ్మగాని వెంకటేశం గౌడ్, అన్నవేణి శ్రీనివాస్,మానస, మంజు లా, రమ, పంచాయతీ కార్యదర్శి సంపత్ గ్రామస్తులు సంపత్ రెడ్డి,రాజయ్య, కొము రయ్య, గట్టు సంపత్ పారిశుధ్య కార్మికులు రాజేశం, సంబయ్య, సమ్మయ్య, రామవ్వ, మూతవ్వ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో ఇందిరమ్మ టవర్స్‌కు శ్రీకారం

**ముద్ర, హైదరాబాద్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గం విలేజ్‌లో 2.85 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భూమిపూజ చేశారు. PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహించేలా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని గాంధీ తెలిపారు. తొలి దశలో 480, రెండో దశలో 680 ఇళ్లను నిర్మించనున్నట్లు చెప్పారు. ఒక్కో ఫ్లాట్ సుమారు 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని, లబ్ధిదారుడికి రూ.6 లక్షల వ్యయంతో పాటు ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ, ఉచితంగా భూమి అందిస్తుందని తెలిపారు. అర్హులైన పేదలకు లక్కీడిప్ ద్వారా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరుగుతుందని చెప్పారు.




## బిజెపివి చీప్ పాలిటిక్స్..

- నిమజ్జన ఏర్పాట్లపై రాద్ధాంతం ఏంటి
- పవిత్ర పండుగలను రాజకీయం చేయడం తగదు
- మేడిపల్లి సత్యం చొరువతో నీటి విడుదల
- డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేశ్



**ముద్ర, కరీంనగర్ :** వినాయక నిమజ్జన ఏర్పాట్ల విషయంలో బిజెపి పార్టీ చీప్ పాలిటిక్స్ రాజకీయాలకు తెర లేపడం సిగ్గుచేటని డిసిసి అధికార ప్రతినిధి అనంతుల రమేష్ మండిపడ్డాడు.. సోమవారం కొత్తపల్లి వెలిచాల ప్రజా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.. ఈ సందర్భంగా గత కొన్నేళ్లుగా కరీంనగర్ పట్టణంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లు అంగరంగ వైభవంగా సాగుతున్నా యని, తాజాగా నిమజ్జనానికి నీళ్లు వదలం లేదని బిజెపి దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ పీఠాన్ని కైవాసం చేసుకున్న బిజెపి పండుగ ఏర్పాట్లను నిమజ్జనం చేసే విషయంలో బాధ్యత యుతంగా వ్యవహరించాల్సింది పోయి ధర్నాలకు దిగి,అనవసర అల్లర్లకు ఆజ్యం పోయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రతి ఏటా నిధుల కేటాయింపు తో పాటు ఎస్సారెస్పీ నీటి విడుదలపై చర్యలు తీసుకుంటున్న విషయం బిజెపికి తెలియంది కాదని, ప్రజల దృష్టి మరల్చేందుకు నిమజ్జనం ఏర్పాట్లను కూడా రాజకీయం చేయడం బిజెపికే చెందిందని మండిపడ్డారు.. ఎస్సారెస్పీ నీటి విడుదల విషయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి తోటి మాట్లాడి నీటి విడుదలకు కృషి చేశారని అన్నారు.. నీటి విడుదల ప్రక్రియను గమనించిన బిజెపి నాయకులు నీటి విడుదల క్రెడిట్ ను తమ ఖాతాలో వేసుకునేందుకు చీప్ పాలిటిక్స్ కు పాల్పడడం సిగ్గుచేటని అన్నారు.. పవిత్రమైన పండుగలను కూడా రాజకీయాలకు జోడించి లబ్ధి పొందాలని బిజెపి తీరును ప్రజలు గమనిస్తున్నారని ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని హితవు పలికారు..

## నిమజ్జనానికి నీటి విడుదలపై బీజేపీ ధర్నా డ్రామా



**ముద్ర, కరీంనగర్:** గణేశ్ నిమజ్జనానికి నీటి విడుదల అంశంపై బీజేపీ చేపట్టిన ధర్నాను సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. చింతకుంట కెనాల్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఆయన.. ప్రభుత్వం ఇప్పటికే నిమజ్జన ఏర్పాట్లపై వారం రోజులుగా పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంత్రులు, అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను సమీక్షిస్తున్నారని చెప్పారు. నిమజ్జనానికి అవసరమైన నీటి విడుదలపై కూడా అధికారులు ముందుగానే చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఇప్పటికే కెనాల్‌లో సిల్ట్ తొలగించడం, డస్ట్ పోయడం, అవసరమైన మిషనరీని సిద్ధం చేయడం వంటి పనులు పూర్తయ్యాయని తెలిపారు. అయితే బీజేపీ నాయకులు ఉదయం 11 గంటలకు ధర్నా చేస్తామని ప్రకటించి.. 11 గంటలకు నీటి విడుదల జరగనున్న విషయం తెలుసుకుని 10.30 గంటలకే ధర్నాకు దిగడం విడ్డూరంగా ఉందని నరేందర్‌రెడ్డి అన్నారు. ధర్నా ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే ప్రభుత్వం నీటి విడుదలపై నిర్ణయం తీసుకుందని బీజేపీ నేతలు ప్రకటించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. ప్రభుత్వం ముందుగానే చేపట్టిన ఏర్పాట్లను తమ పోరాటం వల్లే జరిగాయని చెప్పుకోవడం బీజేపీ డ్రామాకు పరాకాష్ఠ అని అన్నారు. ఇలాంటి రాజకీయ ట్రిక్స్ ఇకపై పనిచేయవని బీజేపీ నాయకులు తెలుసుకోవాలని సూచించారు.కరీంనగర్ అభివృద్ధితో పాటు అన్ని పండుగలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని నరేందర్‌రెడ్డి తెలిపారు. అన్ని వర్గాల మనోభావాలను గౌరవిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అధికారులు ఇప్పటికే చేపట్టిన పనులను పరిశీలించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## చింతకుంట కెనాల్ వద్ద ఉద్రిక్తత






**ముద్ర, కరీంనగర్:** గణేశ్ నిమజ్జనానికి చింతకుంట కెనాల్‌లో నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. ధర్నా చేస్తున్న కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు లాఠీఛార్జ్ చేసి కార్యకర్తలను గల్లా పట్టుకుని ఈడ్చుకెళ్లారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్‌పై పోలీసులు దాడి చేశారని కార్యకర్తలు ఆరోపించారు. కరీంనగర్ డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ.. గణేశ్ నిమజ్జనానికి నీళ్లు అడిగితే లాఠీలతో కొట్టించడం దారుణమన్నారు. నీటిని విడుదల చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బోయినిపల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ.. నిమజ్జనానికి నీళ్లు ఇవ్వాలని అడిగిన వారిపై లాఠీఛార్జ్ చేయడం హేయమన్నారు.

డిప్యూటీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ.. నిమజ్జనానికి అరటీఎంసీ నీళ్లు అడిగినా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. నగర పాలక సంస్థ అన్ని ఏర్పాట్లు చేసినా నీటిని విడుదల చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే నీటిని విడుదల చేయాలని, లేకపోతే పోరాటం కొనసాగిస్తామని బీజేపీ నేతలు హెచ్చరించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 22.09.2026
www.mudranews.in | @mudranews



### హెల్తీ ఫుడ్ అయినా.. ఎక్కువ తింటే షుగర్ పెరగొచ్చు!

డయాబెటిస్ ఉన్నవారు తీపి పదార్థాలు, కూల్‌డ్రింక్స్, ప్యాక్ చేసిన జ్యూస్‌లకు మాత్రమే దూరంగా ఉంటే సరిపోదని నిపుణులు సూచిస్తున్నారు. తెల్లన్నం, మైదా వంటకాలు, బిస్కెట్లు వంటి కార్బోహైడ్రేట్లు అధికంగా ఉన్న ఆహారాన్ని పరిమితంగా తీసుకోవాలి. పండ్లు, ఓట్స్ వంటి ఆరోగ్యకరమైన ఆహారాలను కూడా మితిమీరి తింటే రక్తంలో గ్లూకోజ్ పెరగవచ్చు. కాబట్టి ఆహారం నాణ్యతతో పాటు పరిమాణంపైనా దృష్టి పెట్టాలి.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా ఇంచార్జీ కలెక్టర్ భాస్కర్ రావు**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఇంచార్జీ కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ కలెక్టర్,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 94 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.



అందులో రెవిన్యూ శాఖ 55, సర్వే ల్యాండ్స్ 7, వ్యవసాయ 4, పంచాయతీ 3, మున్సిపాలిటీ 3, ఇరిగేషన్ 2,ఆర్ అండ్ బి 2,జిల్లా పరిషత్ 2, మైన్స్ అండ్ జువాలిజి 2, గ్రామీణ అభివృద్ధి శాఖ, ఉపాధి కల్పన, సంక్షేమ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, లేబర్, హౌసింగ్, ఎక్సైజ్, పరిశ్రమలు,విద్య, విద్యుత్, ఎస్సీ డెవలప్మెంట్, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, డి సి ఓ, శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలిపారు.ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కృతిక, సాత్విక్, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు , ఆర్డీఓ శేఖర్ రెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్–2026 ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఎస్ఐఆర్–2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.సోమవారం, హైదరాబాదు నుంచి ఎస్ఐఆర్–2026 కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేయడంతో పాటు వాటిపై తదుపరి చర్యలు చేపట్టి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. చివరి నిమిషం వరకు ఫారం–6, 7, 8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ముందుగానే పరిష్కరించాలని స్పష్టం చేశారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని తెలిపారు. ప్రతి బీఎల్ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని









ఆదేశించారు.అక్టోబర్ చివరి వారంలోగా అనామలీస్, ఇతర మ్యాపింగ్‌కు సంబంధించి ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు, వాటి పరిష్కార ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు.ఎస్ఐఆర్–2026కు సంబంధించిన అన్ని పనులను అక్టోబర్ 25లోపు పూర్తి చేయాలని, చివరి 10 రోజులను చివరి క్షణంలో అవసరమయ్యే సవరణలు, ఇతర ప్రక్రియల కోసం కేటాయించుకోవాలని ఆదేశించారు.ఫారం–6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా అందజేయాలని స్పష్టం చేశారు. ఫారం–6తో పాటు అవసరమైన డిక్లరేషన్, సంబంధిత పత్రాలను సమర్పించేలా అర్హులైన ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు.ఓటర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.అవసరమైన సందర్భాల్లో బీఎల్ఏలు ఇళ్లను గుర్తించడంలో సహకరించవచ్చని తెలిపారు. బీఎల్ఏ ద్వారా నోటీసులు పంపిణీ చేసినట్లు గుర్తిస్తే సంబంధిత బీఎల్ఓపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వయోవృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్న ఓటర్ల తరపున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై, సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయంపై బీఎల్ఓలు సంబంధిత ఓటర్లకు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు.బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భువనగిరి ఆర్డీఓ కృష్ణా రెడ్డి , ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా నిర్వహించాలి

**భక్తులు, ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలి**
**కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్**

**ముద్ర, సూర్యాపేట, సెప్టెంబర్ 21:** గణేష్ నిమజ్జనాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. బుధవారం జరగనున్న నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దలచెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, ఎస్పీ నరసింహా, మున్సిపల్ చైర్మన్ నివేదిత లక్ష్మాది, అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్, పారిశుద్ధ్యం, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవ కమిటీలు ముందస్తుగా నిమజ్జనానికి



బయలుదేరి వీలైనంత త్వరగా కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. నిమజ్జన వాహనాలు పూర్తి కండిషన్‌లో ఉండాలని, వాటిపై పిల్లలను ఎక్కించరాదని స్పష్టం చేశారు. వృద్ధులు, మహిళలు నిమజ్జన ప్రాంతాలకు దూరంగా ఉండి భద్రతా సిబ్బందికి సహకరించాలని కోరారు.ఎస్పీ నరసింహా మాట్లాడుతూ జిల్లాలో గణేష్ నిమజ్జనాల కోసం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామని, అన్ని కోణాల్లో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. యువత, ఉత్సవ కమిటీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.మున్సిపల్ చైర్మన్ నివేదిత లక్ష్మాది మాట్లాడుతూ నిమజ్జన ప్రాంతంలో నీరు కలుషితం కాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి, నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, స్థానిక డిఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ, రూరల్ ఇన్స్పెక్టర్లు వెంకటయ్య రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, ఫైర్ ఎస్ఐ జానయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అనంతల కృపాకర్ సభ్యులు రంగరాజు రుక్మారావు చల్లమల్ల నరసింహ గందూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరిలో సినీనటి మీనాక్షీ చౌదరి సందడి

**గరుడ షాపింగ్ మాల్ ప్రారంభించిన సినీనటి మీనాక్షీ చౌదరి**
**హాజరైన రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్రావు**
**పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**





**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన గరుడ షాపింగ్ మాల్ ని ప్రముఖ సినీనటి మీనాక్షి చౌదరి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రావు, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సినీనటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానం యాదగిరిగుట్టకు అతి సమీపంలో గరుడ షాపింగ్ మాల్ ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. షాపింగ్ మాల్ అధినేత జక్క రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ మా గరుడ షాపింగ్ మాల్ తెలంగాణలో తెలంగాణలో మొట్టమొదటగా మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండల కేంద్రంలో ప్రారంభించినట్లు తెలిపారు. నేడు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బస్టాండుకు సమీపంలో నూతన అంగులతో ఏర్పాటు చేయబడ్డ షాపింగ్ మాల్ లో మీకు సరసమైన ధరలకు నూతన నూతన డిజైన్లతో కూడిన వర్గాలను అందించడం జరుగుతుందని తెలిపారు. కస్టమర్లకు నచ్చిన సరికొత్త డిజైన్లతో చీరలు, మెన్స్ వేర్, కిడ్స్ వేర్ నూతన డిజైన్లతో మీ ముందుకు తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ అధినేత కుటుంబ సభ్యులు అనంతరెడ్డి, మనీషా, శ్రీయ, సమంతకమని, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేశ్ చిస్తీ, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖా బాబురావు, మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పీజీ అడ్మిషన్లలో అదనపు రుసుముపై ఆందోళన

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 21 :** ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ఛాంబర్ వద్ద విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో పీజీ సీట్లు పొందిన విద్యార్థుల నుంచి అదనంగా 15 వేల రూపాయలు వసూలు చేయడాన్ని నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ధర్నా నిర్వహించాయి. అదనపు డిమాండ్ ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ జకీరుల్లా ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐసా జిల్లా కార్యదర్శి జిమ్మీ అశోక్, జార్జ్ రెడ్డి పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం. సురేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఐ. రామకృష్ణ, జిల్లా కార్యదర్శి మనోజ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్సైలుగా పదోన్నతి: అభినందించిన సీపీ

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 21 :** పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హెడ్ కానిస్టేబుళ్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న 11 మందికి అసిస్టెంట్ ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి పొందిన అధికారులకు ర్యాంక్ చిహ్నాలను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. Sd.జలీల్, జె.రవి, Sk.ఖాసిం అలీ, కె.వెంకటేశ్వర రావు, కె.చెన్నారావు, ఎస్.శ్రీనివాసరావు, బి.పిచ్చయ్య, జి.హరి, ఎస్.వెంకట కోటిరెడ్డి, ఆర్.కాళహస్తి, బి.పెద రాజేందర్‌లను సీపీ అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు హేమనాథ్ పాల్గొని పదోన్నతి పొందిన అధికారులకు అభినందనలు తెలిపారు.

## ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలకు తరలిరండి

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 21 :** నగరంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఖమ్మంలో డప్పు దళాలు, రెడ్ షర్ట్ వాలంటీర్లతో భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు ఏఐకేఎంఎస్ జాతీయ నాయకులు జేవీ చలపతిరావు, ఏఐకేఎంఎస్, అనుబంధ సంఘాల నాయకులు వి. కోటేశ్వరరావు, మామిడాల భిక్షపతి, గైని ఐలయ్య, మండల వెంకన్న, అనురాధ, మంగా పాల్గొన్నారు.

## టియూడబ్ల్యూజె ఆధ్వర్యంలో వైద్యశిబిరం

**ముద్ర ప్రతినిధి,ఖమ్మం, సెప్టెంబర్ 21 :** టియూడబ్ల్యూజె(ఐజెయూ) ఖమ్మం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు యశోద క్లినిక్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి ఖాదర్‌బాబాతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి



డిపిఆర్ఓ ఎం.ఏ గౌస్, టియూడబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అనేక ఒత్తిడుల మధ్య పని చేస్తున్న జర్నలిస్టులకు ఇలాంటి వైద్య శిబిరాలు అవసరమని అభిప్రాయపడ్డారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి ఖాదర్‌బాబా మాట్లాడుతూ అనేక ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూ వాటి పరిష్కారానికి కారణవువుతున్న జర్నలిస్టుల తమ పని బాధ్యతల్లో పడి ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదని, ఇలాంటి శిబిరాలు నిర్వహించడం ద్వారా ఎంతో ప్రయోజనం ఉందన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్ కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండె, బోన్ పరీక్షలు, ఈసిజి, షుగర్, ఆరోపెడిక్ పరీక్షలు నిర్వహించారు. యశోద హాస్పటల్ సోమాజిగూడ వైద్యులు డాక్టర్ శ్రీ హర్ష జిఆర్ , డాక్టర్ మురళీ, డాక్టర్ కీర్తి కృష్ణ వైద్యసేవలందించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఎం.భూపాల్, యూనియన్ రాష్ట్ర నాయుకులు వనం వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు మోహిద్దీన్, పసపులేటి సత్యనారాయణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం, కోశాధికారి పిన్ని సత్యనారాయణ, నగర కమిటీ కోశాధికారి ఏలూరి వేణు పాల్గొన్నారు.

## సత్తుపల్లికి గోదావరి జలాలు తరలించడమే లక్ష్యం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 21 :** కమలాపురం వద్ద సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్–3 వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మోటార్ స్విచ్ ఆన్ చేసి గోదావరి జలాలను దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను తరలించడమే



తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నీటిని బేతుపల్లి చెరువులోకి తరలించేందుకు అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని, అధికారులు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో ఈ పనులు వేగవంతం చేశామని, భూసేకరణ కోసం ముఖ్యమంత్రి ఇప్పటికే రూ.45 కోట్లు విడుదల చేశారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూసేకరణ పనులు పూర్తయ్యాయని వివరించారు. అలాగే త్వరలోనే గండుగులపల్లిలోని పంప్‌హౌస్–4ను కూడా పూర్తి చేస్తామని, ఇది పూర్తయితే దమ్మపేట, అశ్వారావుపేట మండలాల ప్రజలకు కూడా గోదావరి జలాలు అందుతాయని హామీ ఇచ్చారు.

## జన గణనలో బీసీ కుల గణన చేపట్టాలి

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 21 :** కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనాభా లెక్కల సేకరణలో బీసీ కుల గణనను ప్రత్యేకంగా నిర్వహించి, ప్రతి బీసీ కులానికి యూనిక్ కోడ్ కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గిరిప్రసాద్ భవన్‌లో రావుల హన్మంతరావు అధ్యక్షతన జరిగిన బీసీ సబ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 21, 22 తేదీలలో హైదరాబాద్‌లో రాష్ట్ర మహాసభలు, నవంబర్ 1న ఖమ్మంలో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు మేకల శ్రీనివాసరావు, శింగు నర్సింహారావు, పగడాల మల్లేష్, గాదె లక్షి నారాయణ, పవన్ పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆపన్నహస్తం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 21 :** జిల్లాల్లోని వివిధ మండలాలకు చెందిన మొత్తం 223 మందికి పైగా లబ్ధిదారులకు..రూ.78.17 లక్షల విలువ చేసే చెక్కులను మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి కాంగ్రెస్ నేతలతో కలిసి పంపిణీ చేశారు.

## ఎస్సీ, ఎస్టీలకు దామాషా ప్రకారం ఫలితాలందాలి

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 21 :** ప్రభుత్వ ఫలాలు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు దామాషా ప్రకారం సంపూర్ణంగా అందాలని రాష్ట్ర షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిషన్ సభ్యులు, కలెక్టర్ దివాకర టీఎస్, సీపీ సునీల్ దత్‌లతో కలిసి భూమి, సర్వీస్, అట్రాసిటీ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నవంబర్‌లో రాజీవ్ యువ వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 22.09.2026
www.mudranews.in | @mudranews



### మందులు టైమ్‌కి.. షుగర్ కంట్రోల్ పక్కా!

డయాబెటిస్ మందులు క్రమం తప్పకుండా, వైద్యులు సూచించిన సమయానికే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పూట మందు మిస్ చేయడం, భోజనానికి సంబంధించి తీసుకోవాల్సిన మందులను ఆలస్యంగా వాడటం వల్ల రక్తంలో షుగర్ స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. మందుల్లో మార్పులు తప్పని సరిగా వైద్యుల సలహాతోనే చేసుకోవాలి.

# వ్యక్తి నిర్మాణంతోనే సమాజ నిర్మాణం

**మాతాజీ నిర్మలానంద సంతు రవిదాస్ 650వ జయంతి సందర్భంగా 209 మంది సామాజిక ప్రముఖులకు సన్మానం**



**ముద్ర, చేవెళ్ల:** వ్యక్తి నిర్మాణంతోనే సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని మాతాజీ నిర్మలానంద అన్నారు. సంతు రవిదాస్ 650వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సోమవారం శంకరపల్లిలోని మణి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సామాజిక సమరసత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అన్ని సామాజిక వర్గాలకు చెందిన 209 మంది పెద్దలను సన్మానించారు. ఈ కార్యక్రమానికి మాతాజీ నిర్మలానంద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ చరిత్ర, వారసత్వం, సంస్కృతిని చిన్ననాటి నుంచే పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడుస్తూ మంచి అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. సూర్యోదయానికి ముందే నిద్రలేవడం, ధ్యానం, యోగ సాధన వంటివి జీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు.అన్ని సామాజిక వర్గాల ప్రజలు ఒకే కుటుంబంలా ప్రేమ, సమానత్వం, స్నేహభావంతో మెలిగినప్పుడే సామాజిక సామరస్యం సాధ్యమవుతుందని తెలిపారు. పాశ్చాత్య సంస్కృతి ప్రభావానికి లోనుకాకుండా భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను కాపాడుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో భగవద్గీతను అధ్యయనం చేయడంతో పాటు మొబైల్ వినియోగాన్ని తగ్గించి పురాణాలు, ఇతిహాసాలు, శాస్త్రాలు, చరిత్రను పిల్లలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. తల్లి ఒక గొప్ప గురువు అని పేర్కొన్నారు.సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ దేశంలోని సాధుసంతులు భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక పరంపరను ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. వివిధ సామాజిక వర్గాలు పరస్పరం సహకరించుకుంటూ సమాజ నిర్మాణంలో భాగస్వాములవుతున్నాయని తెలిపారు. ప్రతి సామాజిక వర్గంలో ప్రత్యేకమైన వృత్తి నైపుణ్యం, కళ, శాస్త్ర పరిజ్ఞానం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత శంకరపల్లి ఖండ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, ఈశ్వరయ్య, హరిశంకర్, రాజేందర్, ప్రశాంత్, లక్ష్మారెడ్డి, మొగులయ్య, నవీన్, నందు, ఆకాష్, కృష్ణయ్య, జంగయ్య, మహేశ్వరరావు, అంజయ్య, ప్రతాప్, ప్రతాపరెడ్డి, నాగిరెడ్డి, సంపత్‌కుమార్, శివ, దినేష్, శ్రీకాంత్, బాలయ్య, సుధాకర్ గౌడ్, రాజు గౌడ్, కవ్వగూడెం శ్రీనుతో పాటు వివిధ గ్రామాల ప్రజలు, వృత్తిదారులు, కుల, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి





**ఎంపీ ఈటల రాజేందర్**

**ముద్ర, కూకట్‌పల్లి :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా భక్తి శ్రద్ధలతో, ఆనందంగా నిర్వహించుకోవాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ నిర్వాహకులకు సూచించారు.గణేష్ నవరాత్రుల సందర్భంగా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి ఈటల రాజేందర్ కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని పలు వినాయక మండపాలను సందర్శించారు. మండప నిర్వాహకుల ఆహ్వానం మేరకు హస్మత్‌పేట్, బోయిన్‌పల్లి, బాలానగర్, ఫతేనగర్, మూసాపేట్, ఖైతలాపూర్ డివిజన్లలో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాల్లో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు, భక్తులు వారికి ఘన స్వాగతం పలికి, శాలువాలతో సన్మానించారు. అనంతరం నిర్వాహకులకు, భకులకు వారు వినాయక చవితి మరియు గణేష్ నవరాత్రుల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, ముఖ్యంగా నిమజ్జనం సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. చెరువులు, నీటి వనరుల్లోకి ఎవరూ దిగకుండా చూసుకోవాలని, ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, విద్యుత్ వైరింగ్ విషయంలో కూడా నిర్వాహకులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, గణేష్ నవరాత్రి ఉత్సవాలను నియోజకవర్గ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆ గణనాథుని దివ్య ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం, ఆనందం వెల్లివిరియాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమాల్లో ఆయా డివిజన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గణేష్ మండప నిర్వాహకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించాలి**

వినాయక చవితి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని గాయత్రి నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ సందర్శించి, శ్రీ విఘ్నేశ్వరునికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.డివిజన్ పరిధిలోని పర్వత్ నగర్, టీమ్ శక్తి సేన – తులసి నగర్, గాయత్రి నగర్, ఇండోర్ షటిల్ కోర్టు పక్కన పర్వత్ నగర్, శ్రీ చైతన్య స్కూల్ రోడ్ నంబర్ 9, శ్రీ వివేకానంద నగర్ తదితర ప్రాంతాల్లో నిలబెట్టిన గణనాథులను ఆయన దర్శించుకున్నారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... వినాయక చవితి ఉత్సవాలు 14 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో, ఉల్లాసంగా, ఉత్సాహంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షిం చారు. బొజ్జ గణపయ్య దివ్య ఆశీస్సులతో కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో క్షేమంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.వినాయక చవితి ఉత్సవాలు ప్రజలందరినీ ఐక్యం చేసే ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలని పేర్కొంటూ.. భక్తిశ్రద్ధలతో పాటు సోదరభావం, ఐక్యత, సేవా స్ఫూర్తితో ఈ వేడుకలను జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వసౌకర్యాలు కల్పించిన ఉత్సవ కమిటీ సభ్యులను, నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు.అనంతరం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో బండి రమేష్ పాల్గొని, భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులతో కలిసి ప్రసాదం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**ఫతేనగర్‌లో నవరాత్రి ఉత్సవాలు: పాల్గొన్న జనసేన నేతలు**



కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని ఫతేనగర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జనసేన నాయకుడు బోగాది వెంకటేశ్వర్ రావు ఆహ్వానం మేరకు ఏర్పాటు చేసిన గణపతి ప్రత్యేక పూజలు, అనంతరం నిర్వహించిన మహా అన్నసమారాధన కార్యక్రమంలో జనసేన ముఖ్య నేతలు పాల్గొన్నారు.ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర జనసేన ఇంచార్జ్ శ్రీ నేమూరి శంకర్ గౌడ్, కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన ఇంఛార్జ్ శ్రీ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక భక్తులతో కలిసి అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాతలాడుతూ.. ఆ విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, భరత్ గౌడ్, స్వాతి గౌడ్, స్థానిక బస్తీ వాసులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## హెచ్‌ఏఎల్ లో అన్నసమారాధన



హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి అన్నసమారాధన కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు సంస్థ సీఈఓ సత్యనారాయణ, జనరల్ మేనేజర్ (జీఎం) మురళీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు సీఈఓ సత్యనారాయణ, జీఎం మురళీకృష్ణలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అధికారులు అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మహా ప్రసాద వితరణలో సుమారు 4,000 మందికి పైగా భక్తులు మరియు ఉద్యోగులకు భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు.ఈ వేడుకలో హెచ్.ఆర్ డీజీఎం విఠల్, సెక్యూరిటీ డీజీఎం కుమారస్వామి, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, కన్వీనర్ వెంకటాద్రి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్, నాయకులు కర్కా నాగరాజు, చంద్రరావు నాయక్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాంచందర్ పాల్గొన్నారు.అలాగే బాబీ, జోగారావు, అశోక్, ప్రవీణ్, కుతాడి కృష్ణ, సురేష్, సుధీర్, కృష్ణ బాబు, వడ్డే నాగార్జున, వెంకటేష్, మంజుల, భారతి, నీలవేణి, జాహ్నవి, భాగ్య, సునీత, లత, రమణ, కుమార్, కృష్ణారావు, పోలేపల్లి శ్రీకాంత్, ప్రేమ్, ప్రవీణ్, శివరామరాజు, సూర్య ప్రకాష్, ఆంజనేయులుతో పాటు కంపెనీ కార్మికులు, అధికారులు, అప్రెంటిస్‌లు, కాంట్రాక్ట్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అలంపూర్ ఆలయాల్లో ఉత్తరాఖండ్ సీఎస్ దంపతుల ప్రత్యేక పూజలు





**ముద్ర, అలంపూర్, సెప్టెంబర్ 21:** ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆనంద్ బర్దన్ దంపతులు సోమవారం అలంపూర్‌లోని ప్రసిద్ధ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలంపూర్‌కు చేరుకున్న సీఎస్ దంపతులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఆలయ అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి మేళతాళాలతో బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలోకి తీసుకెళ్లారు. ముందుగా విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న ఆనంద్ బర్దన్ దంపతులు అనంతరం స్వామివారి అభిషేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా అర్చకులు అలంపూర్ క్షేత్ర విశిష్టత, ఆలయాల చారిత్రక ప్రాశస్త్యాన్ని సీఎస్ దంపతులకు వివరించారు. అనంతరం వేద ఆశీర్వచనం అందించి స్వామి, అమ్మవార్ల ప్రసాదాలను అందజేశారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్‌కుమార్ రెడ్డి, రాజ్‌కుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి దీప్తిరెడ్డి, అలంపూర్ తహసీల్దార్ ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జలదృశ్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఘన నివాళులు



**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 21:** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్ జలదృశ్యంలో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ పద్మశాలి కో–ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, తెలంగాణ హ్యాండ్లూమ్/లూమ్ కార్పొరేషన్ చైర్మన్ దూడెం వెంకటరమణ, తుడా చైర్మన్ గుండు సుధారాణి, వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు ప్రజల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన పదవిని సైతం త్యాగం చేసిన బాపూజీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

## జగద్గిరిగుట్ట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి




**ముద్ర కూకట్పల్లి :** జగద్గిరిగుట్ట ప్రాంత అభివృద్ధికి, ప్రజ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులతో కలిసి సిపిఐ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. జగద్గిరిగుట్టలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో సుదీర్ఘకాలంగా అనేక వినతి పత్రాలు ఇచ్చామని, ఎట్టకేలకు ఆ కల సాకారమై డిసి కార్యాలయం అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నేడు మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ని సిపిఐ నాయకులు శాలువాతో సన్మానించారు. జగద్గిరిగుట్టను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు చొరవ చూపాలని, స్థానికంగా నెలకొన్న ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం, మండల సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు, రాములు, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, యువజన సంఘం కార్యదర్శి కీర్తి, మరియు సిపిఐ నాయకులు సదానందం, సహదేవరెడ్డి, కే. వెంకటేష్, జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555